
ఎలాంటి తప్పు చేయని చంద్రబాబుపై అప్పటి వైసీపీ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే తప్పుడు కేసులు నమోదు చేసింది. చంద్రబాబు అరెస్టు సమయంలో పాదయాత్రను తాత్కాలికంగా నిలిపివేసి నారా లోకేష్ పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచారు. ఆ కష్టకాలంలో కార్యకర్తలు, నాయకులకు ధైర్యం కల్పిస్తూ లోకేష్ ముందుండి పోరాడారు.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 10.09.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 141 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# ప్రతీకారం తీర్చుకోవాలంటే.. నిమిషం చాలు!

అయినా సహనంతోనే వ్యవహరిస్తా.. రాజకీయ కక్షలు నా విధానం కాదు

నన్ను ఇబ్బంది పెట్టినట్టే పవన్ కల్యాణ్‌నూ వేధించారు

నాపై చేసిన ఆరోపణలు రుజువు చేయలేకపోయారు.. అదే నా నిబద్ధత: సీఎం చంద్రబాబు

**పి.గన్నవరం, ఆగస్టు 9 (జర్నలిస్ట్‌ఫైల్) :** రాజకీయ కక్షలకు తాను ఎన్నడూ ప్రాధాన్యం ఇవ్వనని... ప్రజల కోసం... రాష్ట్రాభివృద్ధి కోసం సహనంతో.. ఓపిగ్గా ఉండడం తనకు అలవాటని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. విలువలతో కూడిన రాజకీయం, పేద ప్రజలకు మెరుగైన జీవితం, తెలుగుజాతి అభివృద్ధి కోసం తాను నిరంతరం ఆలోచిస్తానని స్పష్టం చేశారు. మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో భాగంగా బుధవారం కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం పండువారిపేటలో నిర్వహించిన సభలో ప్రసంగించారు. దీంట్లో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి అచ్చెన్నాయుడు కొన్ని కీలకాంశాలను ప్రస్తావించారు. మూడేళ్ల క్రితం సీఎం చంద్రబాబును నాటి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసిందని... ఆ అక్రమ అరెస్ట్ జరిగి సెప్టెంబర్ 9కి సరిగ్గా మూడేళ్లు అయిందంటూ నాటి సంగతులను ఆవేదనతో ప్రస్తావించారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా నాడు జరిగిన అంశాలను బహిరంగ సభలో గుర్తు చేసుకున్నారు. నంద్యాలలో సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన సమయంలో మూడేళ్ల క్రితం సెప్టెంబరు 9న అర్ధరాత్రి వచ్చి తనను అరెస్టు చేస్తామని చెప్పారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ఏ తప్పు చేయకపోయినా అర్ధరాత్రి పూట తనను అరెస్టు చేశారని తెలిపారు. తనపై ఉన్న ఆరోపణలు ఏమిటని ప్రశ్నిస్తే.. అరెస్టు చేసిన తర్వాత చెబుతామని చెప్పారని అన్నారు. ముఖ్యమంత్రిగా పని చేసిన తనను ఉన్నపళంగా అరెస్టు చేసి రాజమహేంద్రవరం జైలుకు తరలించారని పేర్కొన్నారు. తన జీవితంలో ఎన్నడూ ఊహించని ఆ సంఘటన ఓ దుర్మార్గమైన వ్యక్తి ఆలోచనల వల్ల జరిగిందని వ్యాఖ్యానించారు. మిగతా 2లో...

# భూమికీ భద్రత.. రైతుకు భరోసా!

8,234 గ్రామాల్లో రీసర్వే పూర్తి.. 36 లక్షల పాస్‌బుక్‌ల పంపిణీ

16 లక్షల ఎకరాలకు 22ఏ చెర నుంచి విముక్తి

ఈ-కేవైసీ, క్యూఆర్ కోడ్‌తో పట్టాదారు పాస్‌బుక్‌లకు పటిష్ట భద్రత

వారసత్వ భూముల విభజనలో స్టాంప్ డ్యూటీ రూ.1,000కే

2 లో



# ఎన్నారై బలం.. టీడీపీ బలం!




- చంద్రబాబు అరెస్టు నుంచి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు వరకు వెన్నంటే
- 2029లో ఎన్డీయే విజయానికి మరోసారి సమాయత్తం కావాలి: లోకేశ్

**మంగళగిరి (జర్నలిస్ట్‌ఫైల్) :** వచ్చే ఎన్నికల్లో ఎన్డీయేను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, తెలుగుజాతిని నెం.1గా చేసే బాధ్యత సమిష్టిగా తీసుకుందామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎన్ఆర్ఐ టీడీపీ సెంట్రల్ కమిటీ కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమానికి మంత్రి లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎన్ఆర్ఐ టీడీపీ సెంట్రల్ కమిటీ సభ్యులతో ఎన్ఆర్ఐ ఎంపవర్ మెంట్ అండ్ రిలేషన్స్ మినిస్టర్ కొండపల్లి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడిగా డా.పి.గురురాజా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ప్రపంచంలో తెలుగువారు లేని దేశం లేదు. ఏ దేశానికి వెళ్లినా తెలుగులో మాట్లాడితే కనీసం 20మందైనా స్పందిస్తారు. తెలుగువారి ఆత్మగౌరవం స్వర్గీయ ఎన్టీఆర్. రాజకీయాల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారు. రాజకీయాల్లో చదువుకున్న వారికి, మేధావులకు అవకాశం కల్పించారు. సమాజంలో మార్పు కోసం కృషిచేసిన వ్యక్తి అన్న ఎన్టీఆర్. ఆయన ఆశయాలను చంద్రబాబు గారు ముందుకు తీసుకెళ్తున్నారు. 2024 ఎన్నికల్లో తొలిసారిగా 50శాతం స్థానాల్లో యువకులు గెలుపొందారు. ఏడుగురు ఎన్ఆర్ఐలకు కూడా అవకాశం కల్పించిన పార్టీ తెలుగుదేశం పార్టీ. పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు ఎంపీగా విజయం సాధించి కేంద్ర మంత్రిగా పనిచేస్తున్నారు.

**చంద్రబాబు అరెస్ట్ సమయంలో ఎన్ఆర్ఐలు అండగా నిలిచారు :** 2019-24 మధ్య రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడారు. ఆనాడు అమరావతి ఉద్యమానికి ఎన్ఆర్ఐలు మద్దతుగా నిలిచారు. కేసులు పెట్టినా భయపడలేదు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడారు. చంద్రబాబు గారిని అక్రమంగా అరెస్ట్ చేసినప్పుడు 50 దేశాల్లో 200 పట్టణాల్లో ఎన్ఆర్ఐలు కార్యక్రమాలు నిర్వహించారు. నారా బ్రాహ్మణి మనకు రాజకీయాలు అవసరమా అని ప్రశ్నించారు. మిగతా 2లో...

# జిల్లాల పాలనపై సీఎం సమీక్ష

- నేడు ప్రారంభం కానున్న 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు
- రెండు రోజులు.. 19 కీలక అంశాలపై విస్తృత సమీక్ష
- పథకాల అమలు, అభివృద్ధిపై కలెక్టర్లకు చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి, సెప్టెంబర్ 09 (జర్నలిస్ట్‌ఫైల్) :** 10, 11వ తేదీల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు జరగనుంది. రాష్ట్ర సచివాలయంలో రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్లతో పాటు మంత్రులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, విభాగాధిపతులు పాల్గొననున్నారు. 7వ కలెక్టర్ల సదస్సులో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యల నివేదికతోనే మొదటి రోజు సమావేశాలు ప్రారంభమవుతాయి. ఆర్థిక వృద్ధి, సంక్షేమం, మానవాభివృద్ధి, సాంకేతికత, పెట్టుబడులు, శాంతిభద్రతలు లాంటి మిగతా 2లో...

# భక్తులకు బీమా.. ఉద్యోగులకు భరోసా!

- తిరుమలలో దేశంలోనే తొలిసారిగా ఎల్ఐసీ ద్వారా బీమా సదుపాయం
- సహజ మరణానికి రూ.2 లక్షల బీమా.. టీటీడీ ఉద్యోగులకు పెరిగిన రక్షణ
- సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు వైభవంగా సాలకట్ల బ్రహ్మోత్సవాలు
- 25 రాష్ట్రాలతో పాటు సింగపూర్, జర్మనీ కళాకారుల ప్రదర్శనలు
- 16న 25 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

3 లో



# కరెంటు డిమాండ్ పెరుగుతోంది

- బొగ్గు నిల్వలు పుష్కలం ఉండాలి!
- థర్మల్ ప్లాంట్లలో కనీసం 15 రోజుల నిల్వలు
- బొగ్గు సరఫరాలో ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక
- విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల సామర్థ్యం పెంచాలి
- క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

3 లో



# గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్

- మంత్రి నారా లోకేశ్ ప్రకటన



**అమరావతి, సెప్టెంబర్ 9 (జర్నలిస్ట్‌ఫైల్) :** వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందించాలని నిర్ణయించినట్లు మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. పండుగను భక్తిశ్రద్ధలతో.. విజయవంతంగా నిర్వహించుకునేందుకు ప్రభుత్వం తరఫున మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. మిగతా 3లో...

# నిజం గెలిచింది... చంద్రబాబు అక్రమ అరెస్టుపై ప్రజలే బుద్ధి చెప్పారు



**తెనాలి, సెప్టెంబర్ 9(జర్నలిస్ట్‌ఫైల్) :** ఎటువంటి సాక్ష్యాధారాలు లేకుండా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని అక్రమంగా అరెస్టు చేసి జైలులో పెట్టి అప్పటి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆరోపించారు. చంద్రబాబు అరెస్టు జరిగిన రోజును పురస్కరించుకుని తెనాలిలోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో 'నిజం గెలిచింది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి చంద్రబాబుకు సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబును ఎటువంటి ఆధారాలు లేకుండా అరెస్టు చేసి 53 రోజుల పాటు జైలులో ఉంచారని అన్నారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం చంద్రబాబుపై నమోదు చేసిన కేసుల్లో పలు కేసులను న్యాయస్థానాలు కొట్టివేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ ప్రత్యర్థులపై కక్షసాధింపు ధోరణి సరికాదని పేర్కొన్నారు.

చంద్రబాబు ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించారని ఆలపాటి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనతో మిగతా 2లో...

అనాడు ఆధారాలు లేకుండా కక్షపూరితంగా చంద్రబాబును అరెస్టు చేశారు

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన నాటి జగన్ ప్రభుత్వం

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

## ఎన్నారై బలం.. టీడీపీ బలం!



(మొదటి పేజీ తరువాయి)

అలాంటి సమయంలో నిర్వహించిన 'ఐయామ్ విత్ సీబీఎన్' కార్యక్రమం మా కుటుంబానికి కొండంత బలంగా నిలిచింది. మళ్లీ ప్రజలకు సేవ చేయాలని నిర్ణయించుకున్నాం. ఐదు వేల డాలర్లు ఖర్చుపెట్టి ఓటు వేయడానికి రాష్ట్రానికి వచ్చారు. కొన్ని నెలల పాటు ఉద్యోగాలకు సెలవు పెట్టి గ్రామాల్లో తిరిగారు. ప్రజలను చైతన్య పరిచారు. ప్రజాప్రభుత్వ ఏర్పాటులో భాగస్వాములయ్యారు.

**ఎన్ఆర్ఐలు అంటే మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్ :** ఎన్ఆర్ఐలు అంటే మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్. మంచి ఉద్యోగాలు చేస్తున్నా.. నమ్ముకున్న పార్టీ కోసం, తెలుగుజాతి కోసం నిలబడ్డారు. మీ పిల్లలకు అద్భుతమైన తెలుగు నేర్పిస్తున్నారు. తెలుగుతనం ఏనాడూ మర్చిపోలేదు. సొంత గ్రామాలపై మమకారం, సేవాభావం ఎక్కువ. మీరు చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి కోట్ల రూపాయలు వెచ్చించారు. అదీ మీ కమిట్‌మెంట్. ఇందుకు హృదయపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నా.

**తెలుగుజాతిని నెం.1గా చేసే బాధ్యత తీసుకుందాం:** తెలుగుజాతి గురించి ఆలోచించే పార్టీ తెలుగుదేశం పార్టీ. టీడీపీ అధికారంలో ఉన్నా, లేకపోయినా ఉత్తరాఖండ్ వరదల సమయంలో ప్రత్యేక విమానం పెట్టి తెలుగువారిని రక్షించాం. ఉక్రెయిన్ పై దాడుల సమయంలో తెలుగువారికి అండగా సీబీఎన్ నిలిచారు. గతేడాది సంక్షోభం కారణంగా నేపాల్ లో చిక్కుకుపోయిన తెలుగువారి కోసం ప్రత్యేక విమానం ఏర్పాటుచేసి వారిని సురక్షితంగా ఇళ్లకు తరలించాం. ఎన్ఆర్ఐలు తెలుగుజాతికి బ్రాండ్ అంబాసిడర్లు. తెలుగుజాతిని నెం.1గా చేసే బాధ్యత తీసుకుందాం. ఇందుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దాం. మీరు పనిచేసే కంపెనీలు ఏపీకి వచ్చేందుకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలి. దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వస్తున్నాయి. ఏపీ అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు భాగస్వామ్యం కావాలి.

**ఎన్ఆర్ఐ సభ్యత్వం తీసుకురావాలి :** ప్రజాప్రభుత్వం అధికారంలోకి రావడానికి మీరు చేసిన కృషి మరువలేనిది. ఎన్ఆర్ఐ సభ్యత్వాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉంది. మీరంతా 'మై టీడీపీ యాప్' తో అనుసంధానం కావాలి. 2019-24 మధ్య అనేక మంది న్యూట్రల్స్ కు ఫోన్ చేసి ఎన్నికల్లో గెలుపునకు కృషిచేశారు. తిరిగి ఆ కార్యక్రమాన్ని ప్రారంభించాలి. డాక్టర్ గురురాజాపై బాధ్యత పెరిగింది. ఏ దేశంలో పది మంది ఉన్నా ఎన్ఆర్ఐ టీడీపీ కమిటీ ఉండాలని కోరుతున్నా. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమం జయప్రదం చేయాలి. రాబోయే 30 రోజుల్లో ఇప్పుడున్న కమిటీలను పూర్తిచేద్దాం. కష్టపడిన వారికి కమిటీల్లో స్థానం కల్పించాలి.

**2029 ఎన్నికల్లో ఎన్డీయేను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉంది :** చంద్రబాబుని అక్రమంగా అరెస్ట్ చేసి నేటికి మూడేళ్లు. దొంగ కేసు పెట్టి అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. రూ.3వేల కోట్ల అవినీతి అన్నారు. తర్వాత మూడొందల కోట్లు, తర్వాత 3 కోట్లు అన్నారు. చివరకు ఒక్క రూపాయి అవినీతిని నిరూపించలేకపోయారు. ఐటీ, ఈడీ, కోర్టు క్లీన్ చిట్ ఇచ్చింది. చంద్రబాబు గారు ఏ తప్పు చేయలేదు. ఆయన అభివృద్ధి చేసిన జైల్లోనే నిర్బంధించారు. మనమంతా 24 గంటలు పోరాడాం. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ లో తెలుగువారు రోడ్లపైకి వచ్చారు. అదే మా కుటుంబానికి కొండంత బలం. ఈ రోజు రాత్రి ఇళ్లలో, కలిసికట్టుగా 53 రోజుల అక్రమ నిర్బంధానికి గుర్తుగా 53 క్యాండిల్స్ వెలిగిద్దాం. అక్రమ అరెస్ట్ ను జ్ఞాపకం చేసుకుందాం. చంద్రబాబు గారు ఎప్పుడూ తెలుగుజాతి నెం.1గా ఉండాలని ఆలోచించే వ్యక్తి. అలాంటి నాయకుడికి అందరం అండగా నిలవాలి. 2029 ఎన్నికల్లో ఎన్డీయేను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు.

## ఈవీలకు భారీ ప్రోత్సాహం!





- **2024-29 ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ ద్వారా రాయితీలు**
- **తొలి 5,000 ఛార్జింగ్ కేంద్రాలకు 25% వరకు ప్రోత్సాహకం**
- **గరిష్ఠంగా ఒక్కో కేంద్రానికి రూ.3 లక్షల సాయం**
- **రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

**తాడేపల్లి, సెప్టెంబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో రాష్ట్రంలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ లక్ష్యంగా 2024-29 సస్టెయినబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ ద్వారా ఈవీ తయారీదారులు, కొనుగోలుదారులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు, రవాణా వాహనాలు, ట్రాక్టర్ల కొనుగోలుపై ఎక్స్‌షోరూమ్ ధరలో 5 శాతం వరకు రాయితీ కల్పించామని, ఈ ప్రయోజనం 2027 మార్చి వరకు వర్తిస్తుందని తెలిపారు.

రాష్ట్రంలో రిజిస్టర్ చేసుకునే విద్యుత్ వాహనాలకు ఐదేళ్లపాటు రోడ్ ట్యాక్స్ మినహాయింపు కల్పిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతులను విస్తరించేందుకు తొలి 5,000 ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు వ్యయంలో 25 శాతం వరకు, గరిష్ఠంగా రూ.3 లక్షల ప్రోత్సాహకం అందిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఈవీలకు ఆదరణ వేగంగా పెరుగుతోందని, ఆగస్టులో సుమారు 2.98 లక్షల విద్యుత్ వాహనాలు విక్రయమై, గత ఏడాదితో పోలిస్తే 52.9 శాతం వృద్ధి నమోదైందన్నారు. మొత్తం వాహన మార్కెట్‌లో ఈవీల వాటా 9.5 శాతం నుంచి 12.3 శాతానికి పెరిగిందని చెప్పారు.

2029 నాటికి రాష్ట్రంలో 2 లక్షల విద్యుత్ ద్విచక్ర వాహనాలు, కనీసం 10 వేల త్రిచక్ర వాహనాలు, 20 వేల కొత్త విద్యుత్ కార్ల వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు ప్రజా రవాణాలో ఈవీలను విస్తరించేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి తెలిపారు. ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు, ఈ-మొబిలిటీ నగరాల అభివృద్ధి, స్టార్టప్‌లకు ప్రోత్సాహం వంటి చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

# ప్రతీకారం తీర్చుకోవాలంటే.. నిమిషం చాలు!



(మొదటి పేజీ తరువాయి)

తాను 48 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, 31 ఏళ్ల క్రితమే తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టానని చంద్రబాబు అన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని, పేద ప్రజలకు, తెలుగు జాతికి న్యాయం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నానని తెలిపారు. తనపై అనేకమంది ఆరోపణలు చేశారని, కోర్టులకు వెళ్లారని, అయితే తనపై చేసిన ఆరోపణలను రుజువు చేయలేకపోయారని చెప్పారు. అదే తన నిబద్ధతకు నిదర్శనమన్నారు. రాజకీయాలపై కుటుంబం ఆధారపడకూడదనే ఉద్దేశంతో 36 ఏళ్ల క్రితమే కుటుంబ వ్యాపారాన్ని ప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. తాను ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో కుటుంబ వ్యాపారాన్ని తన సతీమణికి అప్పగించానన్నారు. తనకు ధన వ్యామోహం లేదని, తెలుగు జాతి బాగుండాలన్నదే నిరంతరం తన ఆలోచన అని స్పష్టం చేశారు.

**నాటి సంఘీభావాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటా :** జైలులో ఉన్న సమయంలో తనకేం జరుగుతుందోనన్న ఆందోళనతో తెలుగు జాతి మొత్తం రోడ్లపైకి వచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. నేను జైల్లో ఉన్నప్పుడు నాకు సంఘీభావం తెలిపిన వారిని... నా గురించి ఆందోళన చెందిన వారిని జీవితాంతం గుర్తుంచుకుంటానని తెలిపారు. రాజమండ్రి జైల్లో ఉన్న తనను కలిసేందుకు... సంఘీభావం తెలిపేందుకు కొందరు అడ్డుపడినా హైదరాబాద్‌లో టెకీలు సైతం ముందుకు వచ్చి నిరసనలు తెలిపారని సీఎం చంద్రబాబు చెప్పారు. దేశవిదేశాల్లోని తెలుగు వారంతా స్పందించారన్నారు. ఇక నాడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపిన మద్దతును ఎన్నటికీ మరిచిపోలేనన్నారు. తనకు సంఘీభావం తెలిపేందుకు వస్తుంటే ఆయననూ అడ్డుకున్నారని చంద్రబాబు అన్నారు. అయినా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా పవన్ కల్యాణ్ తనకు సంఘీభావం తెలిపారని గుర్తుచేశారు. గత పాలకులు పెట్టిన కేసులను కోర్టులు కొట్టేశాయని, ఈడీ వంటి సంస్థలు కూడా ఇందులో ఏమీ లేదని తేల్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. గతంలో అచ్చెన్నాయుడు వంటి నేతలను బలవంతంగా అరెస్టు చేసి వేధించారని, పవన్ కల్యాణ్ విశాఖ వెళ్లినప్పుడు ఆయన్ను అక్కడి నుంచి బలవంతంగా వెనక్కి పంపించారని అన్నారు. ఇలాంటి ఘటనలు గత పాలనలో ఎన్నో జరిగాయని సీఎం పేర్కొన్నారు.

**రాజకీయ కక్షలకు దూరంగా :** తాను ముఖ్యమంత్రి అయ్యాక ప్రతీకారం తీర్చుకోవాలంటే ఒక్క నిమిషం చాలని చంద్రబాబు అన్నారు. కానీ తాను ఆ పని చేయలేదని స్పష్టం చేశారు. తాను సహనంగా... ఓపిగ్గా ఉంటానని వెల్లడించారు. గత పాలకులు అంతగా వేధించినా... ఏం చేయలేకపోతున్నానని చాలా మంది అనుకుంటారని.. కానీ అది తన విధానం కాదన్నారు. తెలుగు జాతికి న్యాయం జరగాలన్న లక్ష్యంతోనే పని చేస్తానని.. రాజకీయ కక్షలకు దూరంగా ఉంటానని సీఎం చంద్రబాబు చెప్పారు. తనపై నక్సల్స్ దాడి చేసినా తన సిద్ధాంతాలను... తన లక్ష్యాన్ని మరిచిపోలేదన్నారు సీఎం చంద్రబాబు. ప్రజల కోసం పనిచేయడంలో వెనక్కి తగ్గబోనని స్పష్టం చేశారు. తాను గతంలో నక్సల్స్ సిద్ధాంతాన్ని వ్యతిరేకించానని చంద్రబాబు తెలిపారు. అలిపిరిలో తనపై క్లైమోర్ మైన్లతో దాడి జరిగినా ప్రజల కోసమే పనిచేశానని గుర్తుచేశారు. శాంతిభద్రతల విషయంలో తాను ఎప్పుడూ కఠినంగానే ఉంటానని అన్నారు. ముఠా కక్షల విషయంలో మాట వినని తన పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలను సైతం అరెస్టు చేయించిన చరిత్ర తనదని పేర్కొన్నారు. సీఎంగా తాను సమర్థంగా పనిచేయకపోతే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని చంద్రబాబు అన్నారు. అందుకే ప్రతి అంశాన్ని బాధ్యతగా తీసుకుని పనిచేస్తున్నానని తెలిపారు. ప్రజలు ఆనందంగా, ఆరోగ్యంగా, మంచి జీవన ప్రమాణాలతో ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని ముఖ్యమంత్రి చెప్పారు.

**నాడు-నేడు కేరాఫ్ బెంగళూరే :** ఇదే సమయంలో గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ నైజాన్ని... ఆయన కుటుంబ సభ్యులే చెప్పిన విషయాల ద్వారా అర్థం చేసుకోవాలని చంద్రబాబు వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఆయన కుమారుడి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తాను అప్పట్లోనే చెప్పానని గుర్తుచేశారు. జగన్‌ను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చదువుకోవడానికి అమెరికా పంపిస్తే.. తిరుగుటపాలో వచ్చేశాడని స్వయంగా వైఎస్ చెప్పిన విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన కుమారుడిని ఎప్పుడూ ఏపీకి రానీయలేదని చంద్రబాబు అన్నారు. కొడుకుతో ఇబ్బందులు భరించలేక జగన్‌ను బెంగళూరులోనే ఉంచారని ఆయన తల్లి విజయమ్మ మాజీ ముఖ్యమంత్రి రోశయ్యకు చెప్పుకుని బాధపడ్డారని చంద్రబాబు నాటి సంగతులను గుర్తు చేశారు. తర్వాత కాలంలో ఈ విషయాన్ని రోశయ్య స్వయంగా చెప్పారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి తన కుమారుడిని బెంగళూరు లాంటి చోట ఉంచాల్సిన పరిస్థితి వచ్చిందంటే.. గొడ్డలి పార్టీ అధ్యక్షుడి నైజం ఎలాంటిదో ప్రజలు అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్యను కూడా చంద్రబాబు ప్రస్తావించారు. బాబాయి వివేకాను గొడ్డలి వేటుతో కిరాతకంగా చంపేశారని అన్నారు. తెల్లవారితే ముఖ్యమంత్రిగా ఉన్న తనపై నిందలు వేస్తూ వారి పత్రికలో రాయించారని ఆరోపించారు. తన చెల్లి సునీతను కూడా గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ ఏమార్చారని వ్యాఖ్యానించారు. ఆ రోజే దోషులందరినీ అరెస్టు చేసి ఉంటే ఇప్పుడు పరిస్థితి ఇంత దూరం వచ్చేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు తల్లిని, చెల్లినీ కూడా ఆస్తి కోసం మోసం చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. అలాంటి వ్యక్తులతో రాజకీయాలు చేయాల్సిన దుస్థితి రాష్ట్రానికి వచ్చిందని అన్నారు.

**విభజన కంటే 2019-24లోనే ఎక్కువ నష్టం :** 2019-24 మధ్య కాలంలో రాష్ట్ర విభజన కంటే ఎక్కువ నష్టం ఏపీకి జరిగిందని చంద్రబాబు అన్నారు. గత పాలనలో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని ఒక్కొక్కటిగా సరిచేసుకుంటూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను కక్షతో గోదాట్లో కలిపేశారని ఆరోపించారు. రాజకీయ కక్షతో కాంట్రాక్టర్‌ను మార్చకుండా ఉండి ఉంటే 2021కే పోలవరం ప్రాజెక్టు పూర్తై ఉండేదని అన్నారు. ఇప్పుడు ఎల్ నినో లాంటి కరవు పరిస్థితుల్లో పోలవరం పూర్తై ఉంటే ఆ ప్రాజెక్టే ఏపీని ఆదుకుని ఉండేదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 30 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టును మళ్లీ తానే ప్రారంభించాల్సి వచ్చిందని అన్నారు. వెలిగొండ నుంచి నీళ్లు వచ్చినప్పుడు ఆ ప్రాంత ప్రజలకు ఎంత ఆనందం కలిగిందో.. తనకూ అంతే ఆనందం కలిగిందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు నీరిచ్చినప్పుడూ ఎంతో సంతోషించానన్నారు. గత పాలనలో బయటకు రావాలన్నా, మాట్లాడాలన్నా ప్రజలు భయపడే పరిస్థితి ఉండేదని సీఎం విమర్శించారు. ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల పేపర్లను ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లతో దిద్దించి అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నాసిరకం మద్యం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని సర్వనాశనం చేశారని చంద్రబాబు అన్నారు. కల్తీ మద్యం కారణంగా 30 వేల మంది చనిపోయారని, అనేకమంది ఆరోగ్యాలు కోల్పోయారని పేర్కొన్నారు. వైసీపీ ప్రజల జీవితాలతో ఆడుకుందని చంద్రబాబు అన్నారు. అందుకే 2024లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కూటమికి మద్దతు ఇచ్చారని తెలిపారు. 2024లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన మద్దతు ఢిల్లీలోనూ సంజీవనిలా పనిచేసిందని చంద్రబాబు అన్నారు. రాష్ట్రానికి ఎక్కువ నిధులు తెచ్చుకోగలుగుతున్నామని, పోలవరం, అమరావతి నిర్మాణాలను చేపట్టగలిగామని తెలిపారు. రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాటలోకి తీసుకెళ్లేందుకు కేంద్రం సహకారంతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని సీఎం చెప్పారు.

**అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలి :** ఓవైపు అభివృద్ధి చేస్తుంటే... గొడ్డలి పార్టీ అడుగడుగునా కుట్రపూరితంగా అడ్డంకులు సృష్టిస్తుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తే 350 కేసులు వేసి అడ్డుకునేందుకు ప్రయత్నించారని చంద్రబాబు అన్నారు. ఏడాది తర్వాత ఆ ఉపాధ్యాయుల కుటుంబాల్లో చిచ్చుపెట్టేందుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కేసులు వేసినా సరైన ఆధారాలు లేవని కోర్టులు కూడా చీవాట్లు పెట్టాయని తెలిపారు. అసెంబ్లీకి వచ్చి ప్రజల సమస్యలపై చర్చించమంటే అసెంబ్లీకి వచ్చేదే లేదని గొడ్డలి పార్టీ నేతలు మొండికేస్తున్నారని చంద్రబాబు అన్నారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు బయటకు వస్తే చాలు.. ఎక్కడికి వెళ్లినా హింసే కనిపిస్తోందని ఆరోపించారు. రప్పా రప్పా అంటూ రౌడీయిజం, ఫ్లెక్సీలకు పొట్టేళ్లను బలి ఇవ్వడం వంటి చర్యలతో రాజకీయ పార్టీగా ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. సామాజిక మాధ్యమాల్లో తమ కుటుంబాల గురించి అసభ్యంగా రాయిస్తున్నారని సీఎం ఆరోపించారు. ఎన్ని కుట్రలు చేసినా గొడ్డలి పార్టీకి తాము బెదిరేది లేదని, గట్టిగానే పోరాడతామని స్పష్టం చేశారు.

అయితే కూటమి ప్రభుత్వం ఇన్ని రకాలుగా ఆలోచించి ప్రజలకు మేలు చేసేలా ప్రయత్నిస్తుంటే ఆ పార్టీ చేస్తున్న కుట్రలపై ప్రజలు ఆలోచించాలని కోరారు. ప్రజలకు ఏ విధంగా మంచి చేయాలన్న అంశంపై రెండు రోజుల పాటు సమావేశాలు నిర్వహించి పార్టీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశామని తెలిపారు. జిల్లా కలెక్టర్లతోనూ సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయిలో పౌరసేవలు మెరుగ్గా అందేలా స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పాలనపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించి ఎప్పటికప్పుడు లోపాలను సరిచేసుకుంటున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

## నిజం గెలిచింది...చంద్రబాబు అక్రమ అరెస్టుపై ప్రజలే బుద్ధి చెప్పారు

(మొదటి పేజీ తరువాయి)

విసిగిపోయిన రాష్ట్ర ప్రజలు 2024 ఎన్నికల్లో టీడీపీ, కూటమికి అత్యధిక సీట్లు, భారీ మెజారిటీతో విజయాన్ని అందించి స్పష్టమైన తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రజల తీర్పుతో కూటమి ప్రభుత్వం ఏర్పడి రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేసిందన్నారు.

గత రెండేళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నడిపిస్తున్నారని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జిల్లాల పాలనపై సీఎం సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)


కీలక విభాగాల వారీగా సమీక్షించనున్నారు. అలాగే ప్రభుత్వ సేవలు, వివిధ పథకాల అమలు వంటి వాటిపై క్షేత్రస్థాయి పరిస్థితులపై ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశా నిర్దేశం చేయనున్నారు.

**రెండు రోజులు... 19 అంశాలు :** మొదటి రోజున జీఎస్డీపీ, స్వర్ణాంధ్ర విజన్‌కు జిల్లాస్థాయి రోడ్‌మ్యాప్‌లపై సమీక్షిస్తారు. అదే విధంగా సూపర్ సిక్స్ పథకాలు, తాగునీరు, గృహనిర్మాణం, ఆరోగ్యం, విద్యా రంగంలో పురోగతి, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, జలధార, జిల్లాల బెస్ట్ ప్రాక్టీసెస్ సదస్సులో పలువురు కలెక్టర్లు ప్రదర్శిస్తారు. ఇక రెండో రోజు సదస్సులో ఇ-గవర్నెన్స్, ఫైళ్ల పరిష్కారం, ఆర్టీజీఎస్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, జిల్లాల వారీ ర్యాంకింగ్స్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం, నైపుణ్యాభివృద్ధి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం, శాంతిభద్రతలపై సమీక్షించి... అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారు.

# భూమికి భద్రత.. రైతుకు భరోసా!

**పి.గన్నవరం, సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే మూల మంత్రాలుగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రతి వారమూ ప్రజల మధ్యలోనే ఉంటున్నానని వెల్లడించారు. రాష్ట్ర సచివాలయానికి మాత్రమే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో వెలుగు వచ్చేలా చేయటమే అసలైన సుపరిపాలన అని దానికి కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని అన్నారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం పండువారిపేటలో నిర్వహించిన మీ భూమి- మీహక్కు గ్రామసభలో సీఎం పాల్గొని సీఎం ప్రసంగించారు. ప్రతి నెలలోనూ వీలైనన్ని సార్లు ప్రజల మధ్యకు వచ్చి బాగోగులు తెలుసుకుంటున్నానని అన్నారు. ప్రతినెలా మొదటి తేదీనే పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందిస్తూ ప్రజల్ని కలుస్తూ వారి కష్ట సుఖాలను తెలుసుకుంటున్నానని అన్నారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కింద నాలుగో శనివారం హాజరవుతున్నట్టు సీఎం వివరించారు. పీ4తో సామాజిక బాధ్యత కింద ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. అభివృద్ధి చేస్తేనే సంపద సృష్టికి ఆస్కారం ఉంటుందని జీవన ప్రమాణాలు పెంచి అంతా గౌరవంగా జీవించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**భూమికి భద్రత ఇచ్చేలా :** ప్రతీ నెలా 9 తేదీనే మీ భూమి- మీ హక్కు కార్యక్రమానికి హాజరై రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. భూమిపై రైతులు, యజమానులకు హక్కులు కల్పించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత పాలకులు రెవెన్యూ



రికార్డులు తారుమారు చేసి వ్యవస్థను ధ్వంసం చేశారని అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తెచ్చి ప్రజల భూముల్ని కాజేసే ప్రయత్నం చేశారని ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ చట్టాన్ని రద్దు చేసేశామని తెలిపారు. గత పాలకులు రీసర్వే పేరుతో అనేక ఘోరాలు, నేరాలు, పాపాలు చేశారని.. పూర్వీకుల నుంచి వచ్చిన వారసత్వ భూములపై కూడా తమ ఫోటోలు వేసుకున్నారని అన్నారు. సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకునే పిచ్చి ఏమిటో ఎవరికీ అర్థం కాలేదన్నారు. ఇష్టం లేని వ్యక్తుల భూముల్ని, ఆస్తుల్ని 22ఏ జాబితాలో చేర్చి ఇబ్బందులు పెట్టారన్నారు. అందుకే పటిష్టంగా రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి ఎక్కడా అవకతవకలు లేకుండా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ఇస్తున్నామన్నారు. ఈ-కేవైసీ, క్యూఆర్ కోడ్ , బ్లాక్ చెయిన్ టెక్నాలజీ లాంటి భద్రతా ఫీచర్లను పెట్టి పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని అన్నారు.

**రెవెన్యూ సంస్కరణలు :** భూమికి భద్రత ఇవ్వటమే కూటమి ప్రభుత్వ అజెండా అని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ 8234 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 36 లక్షల రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చినట్టు సీఎం వివరించారు. వచ్చే మార్చి నాటికి 8,582 గ్రామాల్లో 56 లక్షల పాస్ పుస్తకాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆటో మ్యూటేషన్ సేవల్ని అందుబాటులోకి తెచ్చామని అన్నారు. వారసత్వ భూముల విభజనలో స్టాంప్ డ్యూటీని రూ.వెయ్యికే పరిమితం చేశామని అన్నారు. 1.25 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలిగిందన్నారు. తప్పులు సరిచేసి 16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి సమస్యను పరిష్కరించామని వివరించారు. శెట్టిపల్లి కంగుంది, వట్టి చెరుకూరు, ముదినేపల్లి లాంటి చోట్ల దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న 244 కీలక భూ సమస్యలకు విముక్తి కల్పించామని అన్నారు. అమలాపురంలోని మాచవరం, ముమ్మిడివరం, రామచంద్రాపురం లో బ్రిటీష్ కాలంలో 1908 నుంచి 22 ఏ1 కింద భూములు నిషేధంలో ఉన్నాయని ఈ సమస్యను కూడా పరిష్కరిస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. 56.37 ఎకరాల భూమిని 1410 మందికి లబ్ది కలిగేలా చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. గొడ్డలి పార్టీ చేసిన తారుమారు చేసిన రికార్డుల్ని ప్రక్షాళన చేసి భూ సమస్యల్ని కొలిక్కి తెస్తున్నామని సీఎం వివరించారు.

**నిత్యం ప్రజల గురించే తపన :** నీటి భద్రతకు, భూమి భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో తీవ్రమైన ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ గోదావరి నుంచి ఈ ఏడాది వెయ్యి టీఎంసీలకు పైగా నీరు సముద్రంలోకి వెళ్లిందన్నారు. ఆ నీటిని వినియోగించుకుంటే రాష్ట్రానికి ప్రయోజనం కలిగేదని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో డయాఫ్రామ్ వాల్ కొట్టుకు పోయిందని.. రాజకీయ కక్షతో కాంట్రాక్టర్ని మార్చటంతో ప్రాజెక్టు ఆలస్యమైందని స్పష్టం చేశారు. 2024లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన మద్దతు ఢిల్లీలోనూ సంజీవనిగా పనిచేసిందని రాష్ట్రానికి ఎక్కువ నిధులు తెచ్చుకోగలుగుతున్నట్టు వివరించారు. ప్రజలకు మరింతగా మేలు చేసే అంశంపై రెండు రోజుల పాటు సమావేశం నిర్వహించి ఎమ్మెల్యేలకూ దిశానిర్దేశం చేశామన్నారు. జిల్లా కలెక్టర్లతోనూ సమావేశాలను నిర్వహించి క్షేత్రస్థాయిలో పౌరసేవల్ని అందించే అంశంపై స్పష్టంగా ఆదేశాలు ఇస్తున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇన్ని రకాల ఆలోచనలతో ప్రజలకు మేలు చేస్తుంటే గొడ్డలి పార్టీ నిత్యం కుట్రలు పన్నుతూ అభివృద్ధిని అడ్డుకుంటోందని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. అంతకు ముందు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఈపీడీసీఎల్ రూ.240 కోట్ల వ్యయంతో చేపట్టిన 3 ఫేజ్ కరెంటు ఇచ్చేలా గ్రిడ్ ఆధునీకరణ పనులకు సంబంధించి శిలాఫలకాన్ని సీఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్, స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

## భక్తులకు బీమా.. ఉద్యోగులకు భరోసా!



**తిరుమల, సెప్టెంబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్) :** భక్తులు, ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశంలోనే తొలిసారిగా శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎల్ఐసీ ద్వారా బీమా సౌకర్యం కల్పించాలని నిర్ణయించింది. తిరుమలలో సహజ మరణం సంభవిస్తే రూ.2 లక్షల బీమా వర్తించేలా చర్యలు చేపట్టింది. ఈ పథకం కోసం ఎల్ఐసీకి టీటీడీ నిధుల నుంచి రూ.2.12 కోట్లు చెల్లించేందుకు పాలకమండలి ఆమోదం తెలిపింది. పాలకమండలి నిర్ణయాలను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర వెల్లడించారు.

టీటీడీ ఉద్యోగుల సంక్షేమానికి కూడా పలు నిర్ణయాలు తీసుకున్నారు. ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు అందించే బీమా మొత్తాన్ని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారు. సీపీఎస్, ఎన్‌పీఎస్ పెన్షనర్లు, వారి కుటుంబాలకు ఈహెచ్‌ఎఫ్ సౌకర్యం కల్పించేందుకు రూ.2 కోట్ల యాజమాన్య వాటాకు పాలకమండలి అంగీకారం తెలిపింది.

**వైభవంగా బ్రహ్మోత్సవాలు :** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు బీఆర్ నాయుడు తెలిపారు. ఈ నెల 14న సాయంత్రం 7 గంటలకు అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ 15న సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణం జరుగుతుందని చెప్పారు. సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

సెప్టెంబర్ 15న రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. సీఎం పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అదే రోజు రాత్రి 9 గంటలకు స్వామివారి పెద్దశేష వాహన సేవలో ముఖ్యమంత్రి పాల్గొంటారని వెల్లడించారు.

**16న ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం :** రిలయన్స్ సంస్థ టీటీడీకి విరాళంగా అందించిన 25 ఎలక్ట్రిక్ బస్సులను సెప్టెంబర్ 16న ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే 2027 సంవత్సరానికి సంబంధించిన టీటీడీ క్యాలెండర్లు, డైరీలను సీఎం ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రత్యేకంగా నిర్వహించనున్నట్లు బీఆర్ నాయుడు తెలిపారు. దేశంలోని 25 రాష్ట్రాలతో పాటు సింగపూర్, జర్మనీ నుంచి కూడా కళాకారులు పాల్గొని తమ ప్రదర్శనలతో భక్తులను అలరించనున్నారని చెప్పారు. దేశ, విదేశీ కళాకారుల భాగస్వామ్యంతో ఈసారి శ్రీవారి బ్రహ్మోత్సవాలు మరింత వైభవంగా సాగనున్నాయని పేర్కొన్నారు.

## కరెంటు డిమాండ్ పెరుగుతోంది



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించే విషయంలో రాజీపడే ప్రశక్తే లేదని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. ఏపీలో ఎండలు వేసవిని తలపిస్తున్నాయని, దీంతో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతోందని ఆయన అన్నారు. ప్రజల అవసరాలు, డిమాండ్‌కు తగినట్లుగా విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశాలు జారీ చేశారు.

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, ఉత్పత్తి పరిస్థితులు, ప్లాంట్ల పనితీరు, సరఫరా వ్యవస్థపై అధికారులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఏపీలో రోజువారీ విద్యుత్ డిమాండ్ 290 మిలియన్ యూనిట్లు దాటి పోతోందని మంత్రి తెలిపారు. ఈ మేరకు థర్మల్, హైడల్ విద్యుత్ ప్లాంట్ల నిర్వహణలో ఎలాంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల పనితీరు సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిమాండ్‌కు సరిపడా విద్యుత్ అందుబాటులో ఉండేలా ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు.

విద్యుత్ డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు సంప్రదాయేతర ఇంధన వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని అధికారులకు గొట్టిపాటి సూచించారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను సద్వినియోగం చేసుకుంటూ వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయాలని పేర్కొన్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో కనీసం 15 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బొగ్గు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా సరఫరా సక్రమంగా జరిగేలా క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. కాగా, ఏపీ సచివాలయంలో జరిగిన ఈ సమీక్షకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, జెన్‌కో ఎండీ, ట్రాన్స్‌కో జేఎండీ, డిస్కంల సీఎండీలు పాల్గొన్నారు.

## గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో వివిధ సమూహాలు నిర్వహించే వినాయక చవితి వేడుకలు విజయవంతంగా జరగాలని కోరుకుంటున్నట్లు నారా లోకేశ్ తెలిపారు. విఘ్నేశ్వరుడు రాష్ట్ర ప్రజలందరిపై తన ఆశీస్సులు కురిపించాలని ఆకాంక్షించారు. పండుగను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందించడంలో భాగంగానే పందిళ్లకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో వినాయక మండపాల నిర్వాహకులకు విద్యుత్ ఖర్చుల భారం కొంత మేర తగ్గనుంది.

# గరివిడి కళాశాలపై.. వైసీపీకి నైతిక హక్కు లేదు!

- ఐదేళ్లు అధికారంలో ఉండి ఒక్క బోధనా పోస్టూ భర్తీ చేయలేదు
- కూటమి వచ్చాక 253 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతి
- ఆరు నెలల్లో నియామకాలు.. వీసీఐ అనుమతుల పునరుద్ధరణ



**అమరావతి, సెప్టెంబర్ 09 (జర్నలిస్ట్ ఫైల్) :** గరివిడి వెటర్నరీ కళాశాలకు వీసీఐ అనుమతులు లభించకపోవడంపై వైసీపీ నేతలు మాట్లాడటం చూస్తుంటే... అసలు వారికి ఆ అంశంపై మాట్లాడే నైతిక హక్కు ఎవరు ఇచ్చారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. ఐదేళ్లు అధికారంలో ఉండి కళాశాల అభివృద్ధిని పట్టించుకోని వారు, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఉత్తర కోస్తా ఆంధ్ర ప్రజలకు మెరుగైన పశువైద్య సేవలు అందించడంతో పాటు, ఈ ప్రాంతంలో వెటర్నరీ విద్యను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో 2016లో గరివిడిలో వెటర్నరీ కళాశాలను ఏర్పాటు చేసింది తెలుగుదేశం ప్రభుత్వమే అని అచ్చెన్నాయుడు తెలిపారు. 2017 ఏప్రిల్‌లో రూ.81.72 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేశామని, 2018 ఫిబ్రవరిలో సుమారు 90 ఎకరాల భూమిని కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభించామని వివరించారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన ఐదేళ్ల సమయం అధికారంలో ఉన్న వైసీపీ ఏం చేసింది? అని మంత్రి నిలదీశారు. ఐదేళ్లలో ఒక్క బోధనా పోస్టునైనా భర్తీ చేశారా? అవసరమైన ప్రయోగశాల పరికరాలు సమకూర్చారా? వీసీఐ ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించారా? నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేశారా? కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారా? ఈ ప్రశ్నలకు వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

2024 ఆగస్టు నాటికి పూర్తికావాల్సిన నిర్మాణ పనులు గత ప్రభుత్వ హయాంలో పూర్తి కాలేదని, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు కూడా ముందుకు సాగలేదని తెలిపారు. పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించిందని స్పష్టం చేశారు. గరివిడి వెటర్నరీ కళాశాలలో మౌలిక వసతుల విషయంలో ఎలాంటి ప్రధాన లోపాలు లేవని తాజా వీసీఐ పరిశీలన స్పష్టం చేసిందని అచ్చెన్నాయుడు తెలిపారు. వీసీఐ జూలై 27, 28 తేదీల్లో కళాశాలను తనిఖీ చేసిందని, భవనాలు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక వసతులు సంతృప్తికరంగా ఉన్నాయని నివేదికలో పేర్కొన్నట్లు తెలిపారు. ఒక వెటర్నరీ కళాశాలకు వీసీఐ అనుమతులు రావాలంటే ఎలాంటి ప్రమాణాలు పాటించాలో మీకు తెలుసా? ఐదేళ్లలో కళాశాలకు అవసరమైన ల్యాబ్ పరికరాలు సమకూర్చారా? మౌలిక సదుపాయాలు కల్పించారా? అవసరమైన భవనాలు నిర్మించారా? కనీసం ఒక్క బోధనా పోస్టునైనా భర్తీ చేశారా? కేవలం 4 ప్రొఫెసర్లు, 8మంది అసోసియేట్ ప్రొఫెసర్ల కొరత కారణంగానే అనుమతి నిరాకరించబడిందని తెలిపింది. ఇది కూడా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఏర్పడిన సమస్య కాదా? అని మంత్రి ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైన ప్రయోగశాల పరికరాలు సమకూర్చడంతో పాటు అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, క్లినికల్ కాంప్లెక్స్, బాలురు, బాలికల వసతిగృహాల నిర్మాణ పనులను పూర్తి చేసిందన్నారు. వీసీఐ ప్రమాణాలకు అనుగుణంగా దాదాపు 99 శాతం మౌలిక వసతుల పనులు పూర్తయ్యాయని తెలిపారు.

కళాశాలలో సిబ్బంది కొరతను పూర్తిగా పరిష్కరించేందుకు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కలిపి మొత్తం 253 బోధనా పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి పొందామని మంత్రి తెలిపారు. ఇప్పటికే వీసీఐ సూచనల మేరకు కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించి మొత్తం బోధనా సిబ్బంది సంఖ్యను 77కు పెంచామని చెప్పారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల రెగ్యులర్ నియామక ప్రక్రియలో ఆలస్యం జరిగిందని, అయితే ఆరు నెలల్లో నియామక ప్రక్రియను పూర్తి చేసి వీసీఐ అనుమతులను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటం గత ప్రభుత్వానికి అలవాటుగా మారిందని మంత్రి మండిపడ్డారు. గత పాలనలో వదిలివేసిన సమస్యలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోందన్నారు. తాము చేసిన తప్పులకు కూడా కూటమి ప్రభుత్వాన్ని బాధ్యులను చేస్తే ప్రజలు నమ్ముతారని వైసీపీ నేతలు భావించవద్దని హెచ్చరించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, ఎవరు ఏం చేశారో ప్రజలకు తెలుసన్నారు. గరివిడి వెటర్నరీ కళాశాలకు వీసీఐ అనుమతుల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అవసరమైన బోధనా సిబ్బంది నియామకాలను పూర్తి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. ఇకనైనా వైసీపీ నేతలు విమర్శలు చేసే ముందు తమ ఐదేళ్ల పాలనను ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని అచ్చెన్నాయుడు సూచించారు.

# విశ్వ వేదికపై నవ్యాంధ్ర పర్యాటకం

- విశాఖలో 41వ ఐఏటీవో జాతీయ సదస్సు
- అరకు.. ఆధ్యాత్మిక, బౌద్ధ క్షేత్రాలకు అంతర్జాతీయ ప్రాచుర్యం
- పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులే లక్ష్యం




**విశాఖ (జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖలో ఈ నెల 10 నుంచి 12 వరకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ జాతీయ సదస్సు విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో బాధ్యతాయుత, పర్యావరణహిత పర్యాటకాన్ని అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విశాఖలోని నోవాటెల్‌లో ఈ నెల 10 నుంచి 12 వరకు నిర్వహించనున్న 41వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ జాతీయ సదస్సు వివరాలను వెల్లడించారు. 'ఇండియా–ది వరల్డ్స్ నెక్స్ట్ టూరిజం ఆపర్చునిటీ' థీమ్‌తో జరిగే సదస్సుకు దేశవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా పర్యాటక రంగ ప్రతినిధులు హాజరుకానున్నారు.

నవ్యాంధ్రప్రదేశ్ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ జాతీయ సదస్సుకు విశాఖ ఆతిథ్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. సదస్సు ద్వారా రాష్ట్రంలోని 1,000 కిలోమీటర్లకు పైబడిన సముద్ర తీరం, అరకు లోయ, గిరిజన సంస్కృతి, బౌద్ధ క్షేత్రాలు, ఆధ్యాత్మిక ప్రాంతాలు, ప్రకృతి సౌందర్యాన్ని అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. సెప్టెంబర్ 13న ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ సభ్యుల కోసం రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు ఆరు ప్రత్యేక పోస్ట్–కన్వెన్షన్ టూర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రాష్ట్ర పర్యాటక భాగస్వాములను ప్రోత్సహించేందుకు ఇయాటా సభ్యత్వానికి సాధారణంగా ఉండే రూ.10,000 ప్లస్ జీఎస్టీ వన్‌టైమ్ అడ్మిషన్ ఫీజును 2026 డిసెంబర్ 31 వరకు రద్దు చేసినట్లు మంత్రి తెలిపారు. పర్యాటక రంగంలో గత రెండేళ్లలో రూ.20 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని, విశాఖలో రూ.5,529 కోట్ల విలువైన 16 ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేశామని వెల్లడించారు. వీటి ద్వారా 950 కొత్త హోటల్ గదులు, 10 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయని చెప్పారు. 2029 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 50 వేల కొత్త గదులను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు.

రూ.94.44 కోట్లతో 'అఖండ గోదావరి' పర్యాటక ప్రాజెక్టును వేగవంతం చేస్తున్నామని, 2027 గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో పర్యావరణహితంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. బుద్ధిస్ట్ సర్క్యూట్, ఉత్తరాంధ్ర టెంపుల్ సర్క్యూట్, పర్యాటక కారిడార్ల అభివృద్ధితో పాటు క్రూయిజ్, సీప్లేన్ సేవలను విస్తరిస్తున్నామన్నారు. పర్యాటక రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాంకేతికత వినియోగంపై ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ సదస్సులో చర్చలు జరగనున్నాయని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా తొలిసారిగా కార్బన్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# నిజం గెలిచింది... నీతి నిలిచింది

- చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు
- కుట్రపూరితంగా 53 రోజుల నిర్బంధం
- నాటి చీకటి రోజుకు నిరసనగా
- 53 కొవ్వొత్తులు వెలిగించిన టిడిపి నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** సరిగ్గా మూడేళ్ల క్రితం ఇదే రోజు రాజకీయ దురుద్దేశంతో జగన్ కుట్రపూరితంగా పెట్టించిన తప్పుడు కేసులో చంద్రబాబుని అర్ధరాత్రి వేళ అరెస్టు చేశారు. 53 రోజులు పాటు జైలులో నిర్బంధించారు. నాటి చీకటి రోజును నిరసిస్తూ.. 'నిజం గెలిచింది' నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా కొవ్వొత్తులు వెలిగించి సీఎం చంద్రబాబుకి ప్రజలు సంఘీభావం ప్రకటిస్తున్నారు.

ఉండవల్లి నివాసంలో తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ 53 కొవ్వొత్తులు వెలిగించారు. ఐదు దశాబ్దాల నిస్వార్థ రాజకీయ విలువల శిఖరం నారా చంద్రబాబునాయుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది తెలుగు ప్రజల ఆశీస్సులతో కడిగిన ముత్యములా తప్పుడు కేసుల నుంచి బయటకు వచ్చారని లోకేష్ పేర్కొన్నారు. ప్రజా బలమే తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబు గారికి శ్రీరామరక్ష అని ధీమా వ్యక్తం చేశారు.

# కాకుమానులో నేడు మెగా వైద్య శిబిరం

**కాకుమాను ( జర్నలిస్ట్ ఫైల్ ) :** గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను వారి వద్దకే చేరవేయాలనే సంకల్పంతో ప్రముఖ పారిశ్రామికవేత్త కారుమంచి ప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా కాకుమాను గ్రామంలో నేడు (గురువారం) ఉదయం 9:00 గంటలకు ఒక భారీ మెగా ఉచిత వైద్య శిబిరంను ఏర్పాటు చేయనున్నారు.

ప్రముఖ ఆసుపత్రుల సౌజన్యంతో

ఈ వైద్య శిబిరానికి రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన వైద్య సంస్థలు తమ సహకారాన్ని అందిస్తున్నాయి. హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ & రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అలాగే గుంటూరుకు చెందిన ప్రసిద్ధ కాటూరి మెడికల్ కళాశాల ఆసుపత్రి వారి సంయుక్త సౌజన్యంతో ఈ శిబిరం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతోంది. గ్రామస్తులకు అండగా నిలిచే ఈ బృహత్తర కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యులు (ఎమ్మెల్యే) బూర్ల రామాంజనేయులు ముఖ్య అతిథిగా విచ్చేసి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది మరియు స్థానిక ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అందుబాటులో ఉండే వైద్య నిపుణులు మరియు సేవలు

ఈ మెగా శిబిరంలో ప్రముఖ వైద్య కళాశాలలు మరియు ఆసుపత్రుల నుండి అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహిస్తారు.

**క్యాన్సర్ నిపుణులు:** క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు గుర్తింపు మరియు నివారణపై అవగాహనతో పాటు పరీక్షలు.

**కార్డియాలజీ (గుండె):** గుండె సంబంధిత సమస్యలు, బీపీ మరియు ఈసీజీ (ఈసీజీ )పరీక్షలు.

**పల్మనాలజీ (ఊపిరితిత్తులు):** శ్వాసకోశ సమస్యలు, ఆస్తమా మరియు ఊపిరితిత్తులకు సంబంధించిన తనిఖీలు.

**నెఫ్రాలజీ (కిడ్నీ):** మూత్రపిండాల వ్యాధుల నిర్ధారణ మరియు తగిన సలహాలు.

**ఆర్థోపెడిక్ (ఎముకలు, కీళ్ళు):** కీళ్ల నొప్పులు, ఎముకల బలహీనత మరియు వెన్నునొప్పి సమస్యలకు వైద్యం.

**సమగ్ర పరీక్షలు:** రోగుల ఆరోగ్య పరిస్థితిని బట్టి అవసరమైన అన్ని రకాల ప్రాథమిక వైద్య పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తారు.

కాకుమాను నుండి బీకేపాలెం వెళ్లే ప్రధాన రహదారి మార్గంలో ఉన్న కారుమంచి ప్రసాద్ కంపెనీ ప్రాంగణం.

మారుమూల ప్రాంతాల ప్రజలు కార్పొరేట్ వైద్యానికి దూరంగా ఉంటున్న దృష్ట్యా, ఈ అరుదైన అవకాశాన్ని కాకుమాను మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. రకరకాల దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు తమ పాత వైద్య రికార్డులను వెంట తెచ్చుకుంటే వైద్యులకు మరింత మెరుగ్గా సలహాలు ఇవ్వడానికి వీలవుతుందని తెలిపారు.

## బ్రహ్మంగారిమఠంలో బ్లాక్ సిలిండర్ల దందా



- మితిమీరుతున్న అక్రమ విక్రయాలు..
- పట్టించుకోని అధికారులు
- ఒక సిలిండర్ ధర 1600 నుండి 1800 బ్లాక్ లో విక్రయం

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్) :** మండల కేంద్రంలో గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెట్ దందా మితిమీరుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ వినియోగదారులకు సకాలంలో సిలిండర్లు అందక ఇబ్బందులు పడుతుండగా కొందరు వ్యక్తులు అధిక ధరలకు సిలిండర్లను విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై సంబంధిత అధికారులు నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. బ్లాక్ మార్కెట్‌కు అడ్డుకట్ట వేసి, అక్రమంగా సిలిండర్లు నిల్వ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే తనిఖీలు చేపట్టి నిజానిజాలను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. బ్లాక్ మార్కెట్లో ఒక్కొక్క సిలిండర్ ధర 1600 నుంచి 1800 , 2000 వరకు వసూలు చేస్తూ సామాన్య ప్రజల నుండి అధిక మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు దీనిపైన ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి బ్లాక్ దందాను అరికట్టాలని ప్రజల కోరుకుంటున్నారు.

## ప్రజల గుండెల్లో చెరగని గాయాలు చేసిన జగన్ పాలన



- నిజం గెలిచింది కార్యక్రమంలో పెమ్మసాని చంద్రశేఖర్

**పెదకాకాని (జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ, 'నిజం గెలిచింది' కార్యక్రమంలో భాగంగా పొన్నూరు నియోజకవర్గంలోని పెదకాకాని మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. సాధారణ గ్రామస్థాయి నుంచి కష్టపడి ఎదిగిన చంద్రబాబు తెలివితేటలు, కష్టపడే తత్వంతో రాష్ట్రానికి దిశానిర్దేశం చేస్తున్నారని అన్నారు. ఉన్నత ఉద్యోగ అవకాశాలు ఉన్నప్పటికీ రాజకీయాలపై ఆసక్తితో ప్రజాసేవలోకి వచ్చారని, వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం ఆలోచించే నాయకుడని కొనియాడారు. విమాన ప్రయాణాల్లోనూ, ఢిల్లీలో నేతలను కలిసినప్పుడూ సమయాన్ని వృథా చేయకుండా రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకురావడంపైనే దృష్టి పెడుతున్నారని తెలిపారు.

గత వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధికి దూరమైందని పెమ్మసాని విమర్శించారు. ఐదేళ్లలో ఒక్క కంపెనీ తీసుకురాలేకపోయారని, ప్రాజెక్టులు పూర్తి చేయలేకపోయారని ఆరోపించారు. ప్రజా వేదిక విధ్వంసం నుంచి అమరావతి అభివృద్ధిని అడ్డుకోవడం వరకు ప్రజలకు ఇబ్బందులు కలిగించారని విమర్శించారు. చంద్రబాబు పాలనలో రెండున్నరేళ్లలో వెలిగొండ ప్రాజెక్టు పూర్తయిందని, పోలవరం నిర్మాణం తుదిదశకు చేరుకుందని, ప్రపంచస్థాయి ఐటీ సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వలివేటి మురళికృష్ణ, ఎంపీపీ శిరీష, జనసేన నాయకుడు ఆళ్ల హరి, మాజీ కార్పొరేటర్ ముత్తినేని రాజేష్ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ కాలేజీల భూములపై కన్ను!

- ◆ శక్తిలో విలీనానికి రేవంత్ సర్కారు కుట్ర..
- ◆ బీజేపీ నేత ఏనుగు సుదర్శన్‌రెడ్డి





**మేడ్చల్ సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి కార్యక్రమంలో విలీనం చేసి, పీపీపీ విధానంలో ప్రైవేటీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన విలువైన భూములపై ప్రభుత్వం కన్నేసిందని విమర్శించారు. మంగళవారం మేడ్చల్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను బీజేపీ యువమోర్చా రాష్ట్ర నాయకుడు బండారి పవన్‌రెడ్డి, జిల్లా నాయకుడు రామన్నగారి శ్రీనివాస్‌గౌడ్, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు కొండం ఆంజనేయులు ముదిరాజ్‌లతో కలిసి ఏనుగు సుదర్శన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఆధీనంలోని శాఖల పని తీరు నిర్వీర్యమవుతోందని ఆరోపించారు. అక్రమంగా డబ్బు దండుకునే ప్రయత్నాల్లో ప్రభుత్వం నిమగ్నమైందని విమర్శించారు. రాష్ట్రంలోని 54 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల భూములపై కన్నేసి, సాంకేతిక విద్యాశాఖ పరిధిలో కొనసాగాల్సిన కళాశాలలను 'శక్తి' పేరుతో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో ప్రైవేటీకరించే ప్రయత్నాలను బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి కార్యక్రమంలో విలీనం చేయడం వల్ల విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని సుదర్శన్‌రెడ్డి అన్నారు. ముఖ్యంగా పాలిటెక్నిక్ విద్య పూర్తిచేసిన అనంతరం బీటెక్ రెండో సంవత్సరంలో నేరుగా చేరే అవకాశాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతిక విద్యాశాఖ పరిధిలో ఉండాల్సిన విద్యార్థులను కార్మిక శాఖలో విలీనం చేయడం ద్వారా ప్రభుత్వం వారిని కేవలం 'స్కిల్డ్ లేబర్'గా పరిగణిస్తున్నట్లుగా విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాలిటెక్నిక్ కళాశాలలను యథావిధిగా సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రయోజనాలకు విరుద్ధంగా తీసుకునే నిర్ణయాలను బీజేపీ పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చెరువుకొమ్ము శ్రీనివాస్‌గౌడ్, వంశీధర్‌రెడ్డి, రాఘవరెడ్డి, ఎల్లంపేట మున్సిపల్ ప్రధాన కార్యదర్శి కంచుకట్ల మహేష్, మేడ్చల్ డివిజన్ కార్యదర్శి బండి విష్ణుమూర్తిగౌడ్, శ్రీపాల్‌రెడ్డి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో కాంగ్రెస్ నాయకుల భారీ నిరసన

- కేసిఆర్ దిష్టిబొమ్మ దహనం





**శంషాబాద్ సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** జిహెచ్ఎంసి కొత్వాల్ గూడా 119డివిజన్ అధ్యక్షులు బొబ్బిలి శేకర్ మరియు మండల పార్టీ అధ్యక్షులు చిలకమర్రి మహేందర్ ముదిరాజ్ గారి ఆధ్వర్యంలో నిన్న తెలంగాణ సభాపతి స్పీకర్ ప్రసాద్ అన్నపై చేసిన అనుచిత వాక్యాలకు పెద్దఎత్తున నిరసన కార్యక్రమం కేసీఆర్ దిష్టి బొమ్మ దహనం, భారీ నిరసన విజయవంతం తెలంగాణ శాసనసభ గౌరవాన్ని, గౌరవ స్పీకర్ ని కించపరిచే విధంగా BRS నాయకులు చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను ఖండిస్తూ ఈరోజు శంషాబాద్ బస్టాండ్‌వద్ద నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమం విజయ వంతంగా ముగిసింది.ప్రజాస్వామ్య విలువలను కాపాడటానికి, శాసనసభ గౌరవాన్ని నిలబెట్టడానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు చల్లా నర్సింహ రెడ్డి , ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గారు, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జెల్లపల్లి నరేందర్,సనమ్ శ్రీనివాస్ గౌడ్ గారు, రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి,మాజీ మండల అధ్యక్షులు శేఖర్ యాదవ్ , మున్సిపల్ మాజీ అధ్యక్షులు సంజయ్ యాదవ్ , జిహెచ్ఎంసి కొత్వాల్ గూడ 119 డివిజన్ అధ్యక్షులు బొబ్బిలి శేఖర్ ముదిరాజ్, శంషాబాద్ మండల అధ్యక్షులు మహేందర్ ముదిరాజ్, సర్పంచ్లు కోటేశ్వర గౌడ్, రవినాయక్, ఆంజనేయులు, ప్రభాకర్ గౌడ్, శేకేర్ యాదవ్,లింగం, గోపాల్ నాయక్, మాజీ సర్పంచులు సతీష్ యాదవ్,శ్రీనివాస్ రెడ్డి , జనరల్ సెక్రెటరీ గొరిగే పృధ్వి గౌడ్, సులోచన గారు, మరియు రాజేంద్రనగర్ నియోజకవర్గం డివిజన్ ప్రెసిడెంట్లు ధనుంజయ, ఇంద్రాపాల్,ప్రవీణ్, మన్నే మహేందర్,కాలేదు భాయ్, గోవర్ధన్ రెడ్డి, , శ్రీధర్ యాదవ్, భాషా భాయ్ , ప్రభాకర్ యాదవ్, ఉమా మహేష్,ఫక్రుద్దీన్, ప్రభాకర్ టీ.సాయి ముదిరాజ్, పాల్సన్, నజీర్ భాయ్, మీట్టు, టీ అశోక్, ఫక్రుద్దీన్, బంగారం కుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ గౌడ్, చందు యాదవ్, సాయి కుమార్, ఇమ్రాన్ ఇలియాస్, కిరణ్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు మణి, బన్నీ, బిట్టు అభి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు మరియు పెద్దఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అసెంబ్లీ సాక్షిగా రైతు కష్టాలపై ముచ్చట ఏడ .?

- ఏలినో ఎఫెక్ట్ రైతులకు కరెంట్ కట్స్ షాక్.
- పంటలు ఎండిపోతుంటే అసెంబ్లీలో రైతుల ముచ్చట ఎక్కడ?
- సరఫరాలో అధికారుల లోపమా. ప్రభుత్వ ఆదేశమా?
- -20 నిమిషాలకే ట్రిప్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని రైతుల ఆవేదన.





**వికారాబాద్, సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా రైతులకు రోజురోజుకూ కష్టంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఎండలు మండిపోతుండగా, మరోవైపు వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలకు నీరందక ఎండిపోతున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు . విద్యుత్ ఎప్పుడు వస్తుందో ఎంతసేపు ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు ఆరోపిస్తున్నారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు వ్యవసాయ బావులు, బోర్ల వద్ద కరెంట్ కోసం ఎదురుచూడాల్సి వస్తోందని చెబుతున్నారు. కరెంట్ వచ్చిన 20 నిమిషాలకే మళ్లీ పోతుండటంతో మోటార్లు ఆన్ చేయడం, ఆఫ్ చేయడం వల్ల అవి దెబ్బతింటున్నాయని, లోవోల్టేజీ కారణంగా బోరు మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్ నియోజకవర్గంలోని వికారాబాద్, మోమిన్‌పేట్, మర్పల్లి, నవాబుపేట్, కోట్‌పల్లి, బంటరం, ధారూర్ మండలాల్లో రైతులు విద్యుత్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కన్నీరు పెట్టుకుంటున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో భూగర్భజలాలు సైతం రోజురోజుకూ అడుగంటుతున్నాయని, ఉన్న కొద్దిపాటి నీటితో పంటలను కాపాడుకోవాలనుకుంటే విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో వేసిన పంట చేతికందే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. రోజురోజుకూ విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ రైతులకు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో పొలాలకు నీరందక పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తున్నారు. వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్ అందిస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని రైతులు విమర్శిస్తున్నారు. విద్యుత్ మరమ్మతుల పేరుతో ఎల్‌సీలు తీసుకోవడం, తరచూ సరఫరా నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అసెంబ్లీలో రైతుల విద్యుత్ సమస్యపై చర్చిస్తారని ఆశిస్తే.. నాయకులు ఒకరినొకరు తిట్టుకోవడం, కొట్టుకోవడం గురించే మాట్లాడుకుంటున్నారు తప్ప రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంటలు ఎండిపోతూ రైతులు ఆగమవుతున్నా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు కనిపించడం లేదని మండిపడుతున్నారు. వేసిన పంట చేతికందడం కష్టమే అని రైతు లు ఆవేదన వ్యక్తం చేశారు. సాగు చేసిన పంటలకు నీరందక ఎండిపోతున్నాయని, పశువుల మేత కోసం వేసిన గడ్డి సొప్ప కూడా నీరందక ఎండిపోయిందన్నారు. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో బోర్లు గ్యాప్ ఇస్తున్నాయని, విద్యుత్ సమస్యతో సాగునీటికి మరింత ఇబ్బంది ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే సాగునీరు, విద్యుత్ సరఫరాపై దృష్టి పెట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**వికారాబాద్ ఇంచార్జ్ డీఈ ఏ.వి నాయుడు..**

రైతులు ఒకేసారి వ్యవసాయ మోటార్లను ఆన్ చేయడం వల్ల అప్పుడప్పుడు విద్యుత్ సరఫరాపై అదనపు లోడ్ పడుతుందని వికారాబాద్ ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ డీఈ ఇన్‌చార్జ్ ఏఈ నాయుడు తెలిపారు. మోటార్లు అన్నీ ఒకేసారి ఆన్ చేయడం వల్ల కొన్ని సందర్భాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటం లేదా ట్రిప్ కావడం జరుగుతుందని ఆయన వివరించారు. అయితే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ శాఖ నిరంతరం చర్యలు తీసుకుంటోందన్నారు. వ్యవసాయానికి ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా అందుబాటులో ఉంటుందని ఏ.వి నాయుడు స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని, సమస్యలను పరిష్కరించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారని వికారాబాద్ ఇంచార్జ్ డీఈ ఏ.వి. నాయుడు తెలిపారు.

## టీపీసీసీ అధ్యక్షుడిగా బలరాం నాయక్‌ను నియమించాలి

- కాంగ్రెస్ అధిష్ఠానానికి ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ విజ్ఞప్తి



**సికింద్రాబాద్, సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా మాజీ కేంద్రమంత్రి పోరిక బలరాం నాయక్‌ను నియమించాలని బంజారా సంఘాల నాయకులు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కోరారు.మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలో ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లాలని కోరారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా బంజారా సామాజిక వర్గం కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తోందని నాయకులు తెలిపారు.పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు అన్ని సామాజిక వర్గాలను సమన్వయం చేసుకునే సామర్థ్యం ఉన్న నాయకుడిగా బలరాం నాయక్‌కు మంచి గుర్తింపు ఉందన్నారు. కేంద్రమంత్రిగా పనిచేసిన సమయంలో ఆయన అన్ని వర్గాల ప్రజలకు సన్నిహితంగా ఉంటూ,చిన్నా పెద్దా అనే తారతమ్యం లేకుండా ఆప్యాయంగా పలకరించేవారని పేర్కొన్నారు.ప్రజలతో మమేకమై పనిచేసే స్వభావం, అందరినీ కలుపుకొని వెళ్లే నాయకత్వ లక్షణాలు బలరాం నాయక్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలంటే సమర్థుడైన నాయకుడికి టీపీసీసీ బాధ్యతలు అప్పగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో బలరాం నాయక్‌ను టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించాలని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని డిమాండ్ చేశారు.ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేఏసీ చైర్మన్ రవీందర్ నాయక్, రవి నాయక్, స్నేహ రాథోడ్, రుక్మిణి బాయ్, సంధ్య, స్వప్న, ప్రవీణ్ నాయక్, గోపి నాయక్, గణేష్ నాయక్, ప్రకాష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలం

- ప్రభుత్వంపై తార్నాక బీఆర్ఎస్ శ్రేణుల నిరసన



**సికింద్రాబాద్, సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ పిలుపు మేరకు,సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ సూచనతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తార్నాక మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతి హరి ఆధ్వర్యంలో మాణికేశ్వరి నగర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు.అనంతరం బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యూత్ వింగ్ అధ్యక్షుడు ఆలకుంట హరితో కలిసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆలకుంట హరి మాట్లాడుతూ.ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం,అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు.420 హామీలు,ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు.ప్రజాస్వామ్యానికి,రాజ్యాంగానికి ప్రతీక అయిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం సాక్షిగా అయినా ప్రభుత్వం ఇచ్చిన హామీలను గుర్తు చేసుకుని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.హామీల అమలు కోసం బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని,ప్రభుత్వం మెడలు వంచే వరకు ఉద్యమాలను కొనసాగిస్తామని ఆలకుంట హరి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రూపని రోశయ్య,బొంత మైసయ్య,విష్ణు,ఓర్సు కృష్ణ,రమేష్ ఇమ్రాన్,వారికూపాల త్రినాథ్,నటరాజ్,వందనా,ఆలకుంట అరుణ్ కుమార్, బత్తుల శ్రీనివాస్,నరేందర్,అంజద్, ఆటో యూనియన్ వెంకటేష్,లక్ష్మణ్,కుంచపు జగన్,కృష్ణమ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు సహించేది లేదు

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ క్షమాపణ చెప్పాలి
- మాజీ కార్పొరేటర్ డా.సామల హేమ



**సికింద్రాబాద్, సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి,రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను మాజీ కార్పొరేటర్ డా.సామల హేమ తీవ్రంగా ఖండించారు.ఈ మేరకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి చిలకలగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.కేసీఆర్‌పై ఇష్టానుసారంగా మాట్లాడటం ఎమ్మెల్యే అహంకారానికి నిదర్శనమని విమర్శించారు.రాజకీయ విమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమే అయినప్పటికీ,ప్రజా నాయకుడిని అవమానించేలా వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.వెంటనే వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని కేసీఆర్‌కు,తెలంగాణ ప్రజలకు ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. క్షమాపణ చెప్పే వరకు ఈ అంశాన్ని వదిలిపెట్టబోమని,తెలంగాణ ఆత్మగౌరవం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తామని హేమ స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శైలేందర్,సాయి యాదవ్,కృష్ణ,ప్రకాష్,అజీజ్,మహిళా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కడ్తాల్ పోలీసుల అదుపులో ఆశా వర్కర్లు

- చలో హైదరాబాద్‌కు బయలుదేరిన ఆశా వర్కర్ల అరెస్ట్
- అధ్యక్షురాలు జ్యోతి,సబిత,లావణ్యలను ఇంటి వద్దే అరెస్ట్ చేసిన పోలీసులు



**కడ్తాల్, సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** తమ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి తరలి వెళ్లేందుకు సిద్ధమైన ఆశా వర్కర్లను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. మంగళ వారం ఉదయం చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధమైన రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల ఆశా వర్కర్ల అధ్యక్షురాలు జ్యోతి, సబిత, లావణ్యలను ఉదయం 6గంటలకు పోలీసులు వారి ఇళ్ల నుంచి అదుపులోకి తీసుకున్నట్లు ఆశా వర్కర్లు తెలిపారు.ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది.ఈ నేపథ్యంలో కడ్తాల్ మండలానికి చెందిన ఆశా వర్కర్లు హైదరాబాద్‌కు వెళ్లకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.రూ.18 వేల కనీస వేతనం,ఉద్యోగ భద్రత కల్పించడం,ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ పెండింగ్ బిల్లులు,పెండింగ్ వేతనాలు చెల్లించడం,ఎన్‌సీడీ ఆన్‌లైన్ పనులు-ఫ్లాట్ డబ్బుల పేరుతో అదనపు భారాన్ని మోపక పోవడం,ఏఎన్‌సీ,పీఎన్‌సీ తదితర విధులకు తగిన పారితోషికం చెల్లించడం వంటి పలు డిమాండ్లను ఆశా వర్కర్లు ప్రభుత్వం ముందు ఉంచుతున్నారు.అలాగే ఆదివారం,పండుగ రోజుల్లో నిర్వహించే విధులకు అదనపు పారితోషికం,20 క్యాజువల్ సెలవులు,6 నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు,రూ.50 లక్షల ఇన్సూరెన్స్,రూ.50 వేల బట్టి ఖర్చులు,రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఏఎన్ఎం-జీఎన్ఎం పోస్టుల్లో ఆశా వర్కర్లకు ప్రాధాన్యత వంటి డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా హైదరాబాద్‌కు తరలివెళ్తున్న తమను ముందస్తుగా అరెస్ట్ చేయడం సరికాదని ఆశా వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

## షాద్ నగర్ ఎమ్మెల్యే పై మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు

- షాద్‌నగర్ ఎమ్మెల్యే పై మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు



**కంటోన్మెంట్, సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** బీఆర్ఎస్ అధినేత,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్ అనుచిత వాక్యాలకు నిరసనగా మోండా డివిజన్ బిఆర్ఎస్ శ్రేణులు మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. వెంటనే ఎమ్మెల్యే శంకర్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.ఇటువంటి బాధ్యతారహితమైన భాష ,దూషణపూరిత వాక్యాలు చేయడం దుర్మార్గమని అన్నారు.సి ఐ రామక్రిష్ణకు లిఖిత పూర్వకంగా పిర్యాదు చేశారు.కావాలని ఉద్రిక్తతను సృష్టించి, ప్రజాశాంతికి భంగం కలిగించి,అనేక మంది మనోభావాలను దెబ్బతీసేవిదంగా చేసిన ఎమ్మెల్యే శంకర్ పై చర్యలు తీసుకోవాలనారు.పిర్యాదు చేసిన వారిలో బి ఆర్ ఎస్ నాయకులు ఆకుల హరిక్రిష్ణ, జి.నాగేందర్(నాగులు) శ్రీనాథ్ (చిరు), రాయి వెంకటేష్, సత్యనారాయణ, అమర్నాథ్,సంతోష్ తదితర నేతలు కార్యకర్తలు ఉన్నారు.

## దళిత స్పీకర్‌పై వ్యాఖ్యలను ఖండిస్తూ పటాన్‌చెరులో కాంగ్రెస్ నిరసన

- బిఆర్ఎస్ ఎమ్మెల్సీని తక్షణమే సస్పెండ్ చేయాలి: కాట సుధా శ్రీనివాస్ గౌడ్



**పటాన్‌చెరు, సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** దళిత స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చేసిన అహంకారపూరిత, అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పటాన్‌చెరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. పటాన్‌చెరు డివిజన్‌లోని గాంధీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వైఖరిని ఖండిస్తూ నినాదాలు చేశారు.కాట సుధా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ప్రజాప్రతినిధులు హుందాతనంతో వ్యవహరిస్తూ రాజ్యాంగ విలువలను గౌరవించాలని సూచించారు. దళిత స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయనను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.రాజ్యాంగ పదవులకు, ప్రజాస్వామ్య వ్యవస్థకు గౌరవం ఉండేలా ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన, మహిళా నాయకులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రాజగోపురం నిర్మాణం..

- ప్రత్యేక పూజల అనంతరం ప్రధాన ద్వారంపై కప్పు ఏర్పాటు



**కడ్తాల్, సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మక్త మాదారం గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ రాజ గోపురం నిర్మాణ పనులు కొనసాగు తున్నాయి. నిర్మాణంలో భాగంగా సోమవారం ఆలయ ప్రధాన ద్వారంపై కప్పును ఏర్పాటు చేశారు.ఆలయ ధర్మకర్త విజమూరి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రధాన ద్వారంపై కప్పును ఏర్పాటు చేశారు.ఆలయ అభివృద్ధిలో భాగంగా రాజగోపురం నిర్మాణాన్ని చేపట్టగా,పనులు దశలవారీగా కొనసాగుతున్నాయి.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ,ఆలయ భక్తులు,గ్రామస్థులు పాల్గొన్నారు. రాజ గోపురం నిర్మాణం పూర్తయితే ఆలయానికి మరింత శోభ చేకూరుతుందని భక్తులు ఆకాంక్షించారు.

# పేదల పండుగలో మరో కొత్త అధ్యాయం

ఎన్టీఆర్ భరోసాతో మరింత మందికి సామాజిక భద్రత ఇప్పటికే 62 లక్షల మందికి భరోసా... ఇప్పుడు కొత్త అర్హులకూ అవకాశం

- సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ
- స్వర్ణ గ్రామంస్వర్ణ వార్డు కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు




**అమరావతి, సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**
రాష్ట్రంలో ప్రతి నెలా జరిగే 'పేదల పండుగ'ను ప్రభుత్వం మరో స్థాయికి తీసుకువెళ్తోంది. ఇప్పటికే దేశంలోనే అత్యధిక స్థాయిలో సామాజిక భద్రత పింఛన్లు అందిస్తూ 62 లక్షల మంది పేదలకు ప్రతి నెలా ఆర్థిక భరోసా కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం, ఇప్పుడు ఆ భరోసాను మరింత విస్తరించేందుకు సిద్ధమైంది. అర్హత కలిగిన మరింత మంది పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర బలహీన వర్గాలకు కొత్తగా అవకాశం కల్పిస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద తాజా దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది.

సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తుల పరిశీలన నుంచి అర్హత నిర్ధారణ, ప్రభుత్వ ఆమోదం వరకు ప్రతి ప్రక్రియను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేసి, అర్హులైన వారికి దశలవారీగా పింఛన్లు మంజూరు చేయనున్నారు.

**కొత్త అర్హులకు మరో అవకాశం**
అర్హత ఉన్నప్పటికీ వివిధ కారణాలతో ఇప్పటివరకు పింఛన్ పొందని వారికి మరో అవకాశం కల్పిస్తోంది. సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తారు. అర్హులైన వారు తమకు సంబంధించిన స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డు కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చు. దరఖాస్తు స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయిన తరువాత నిర్దిష్ట కాలపట్టిక ప్రకారం అర్హతను పరిశీలిస్తారు. జాప్యానికి తావులేకుండా స్పష్టమైన కాలపట్టిక

కొత్త పింఛన్ దరఖాస్తుల ప్రక్రియలో పారదర్శకతతో పాటు వేగానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. ప్రతి దశకు స్పష్టమైన గడువు నిర్ణయించింది.

- సెప్టెంబర్ 7-16: దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ ధృవీకరణ.
- సెప్టెంబర్ 17-21: సాధారణ అర్హత పరిశీలన.
- సెప్టెంబర్ 22-24: భౌతిక, శాఖాపరమైన ధృవీకరణ, అర్హత నిర్ణయం, సిఫారసు.
- సెప్టెంబర్ 25-26: సెర్ప్ ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు, ప్రభుత్వ ఆమోద ప్రక్రియ.
- అన్ని స్థాయిల్లో పరిశీలన పూర్తయిన అనంతరం అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా పింఛన్లు మంజూరు చేస్తారు.

రాష్ట్రంలోని అన్ని స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్త పింఛన్ దరఖాస్తు సేవ అందుబాటులో ఉంటుంది. నిర్ణీత నమూనాలోని దరఖాస్తు ఫారాలను ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతారు. అర్హులు దరఖాస్తును పూర్తి చేసి, అవసరమైన ధృవపత్రాలతో సంబంధిత స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డు కేంద్రంలో సమర్పించాలి. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అనంతరం సిస్టమ్ జనరేటెడ్ అక్నాలెడ్జ్‌మెంట్ అందజేస్తారు.

**అవసరమైన ధృవపత్రాలు**
అన్ని కేటగిరీలకు సాధారణంగా ఆధార్ కార్డు, రైస్ కార్డు లేదా ఆదాయ ధృవపత్రంతో పాటు సంబంధిత కేటగిరీకి అవసరమైన ప్రత్యేక ధృవపత్రాలను సమర్పించాలి.

- వృద్ధాప్య పింఛన్: వయస్సు నిర్ధారణకు ఆధార్.
- వితంతు పింఛన్: భర్త మరణ ధృవపత్రం, భర్త ఆధార్ నంబర్.
- ఒంటరి మహిళ: వివాహిత అయితే కోర్టు/అదాలత్ విడాకుల డిక్రీ; అవివాహిత అయితే తహసీల్దార్ జారీ చేసే వివాహం కాని ధృవపత్రం.
- దివ్యాంగుల పింఛన్: 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ బెంచ్‌మార్క్ దివ్యాంగత్వాన్ని నిర్ధారించే ధృవపత్రం.
- చేనేత కార్మికులు: చేనేత మరియు జౌళి శాఖ ధృవపత్రం.
- మత్స్యకారులు: మత్స్య శాఖ ధృవపత్రం.
- డప్పు కళాకారులు: సాంఘిక సంక్షేమ శాఖ ధృవపత్రం.
- సంప్రదాయ చెప్పుల తయారీదారులు: సాంఘిక సంక్షేమ శాఖ ధృవపత్రం.
- కల్లుగీత కార్మికులు: నిషేధ మరియు ఎక్సైజ్ శాఖ ధృవపత్రం.
- ట్రాన్స్‌జెండర్ లబ్ధిదారులు: జిల్లా వైద్య మండలి ధృవపత్రం.

**పింఛన్ అంటే పేదలకు పండుగ...**
పేదల సేవలో పింఛన్ల పండుగను మరింత విస్తరిస్తున్న ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీన రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల పంపిణీ ఒక పండుగ వాతావరణాన్ని తీసుకువస్తోంది. వృద్ధులకు ఆత్మగౌరవం, వితంతువులకు ఆర్థిక భరోసా, దివ్యాంగులకు అండ, నిరుపేద కుటుంబాలకు జీవనాధారంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం నిలుస్తోంది. పింఛన్ అందుకుంటున్న వారి సంఖ్యను మాత్రమే పెంచడం కాకుండా, అర్హత ఉన్న ప్రతి పేదవాడికి సామాజిక భద్రత అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇప్పటివరకు పింఛన్ పరిధిలోకి రాని అర్హులను గుర్తించి వారికి కూడా ఈ భరోసాను అందించేందుకు తాజా దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించడం ఆ దిశలో మరో కీలక ముందడుగు.

**దేశంలోనే అత్యున్నత సామాజిక భద్రత**
ప్రస్తుతం రాష్ట్రంలో 61,92,396 మంది పింఛనుదారులకు నెలకు రూ.2,694 కోట్ల మేర పింఛన్లు అందిస్తున్నారు. రాష్ట్ర జనాభాలో సుమారు 12.88 శాతం మంది సామాజిక భద్రత పింఛన్ల ప్రయోజనం పొందుతున్నారు. పింఛన్ మొత్తం, పింఛనుదారుల సంఖ్య, నెలవారీ వ్యయం, పింఛన్ల కోసం కేటాయిస్తున్న వార్షిక నిధుల పరంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యున్నత స్థానంలో ఉంది. ఇది కేవలం గణాంకాల్లో కనిపించే రికార్డు మాత్రమే కాదు... కోట్లాది పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న నిరంతర ఆర్థిక భరోసాకు నిదర్శనం.

**రూ.73,508 కోట్లతో చిత్తశుద్ధికి నిదర్శనం**
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. ఎన్నికల హామీ మేరకు పింఛన్ మొత్తాల పెంపును అమలు చేసింది. ప్రస్తుతం వృద్ధులు, వితంతువులకు నెలకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000, తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలు వర్గాలకు రూ.10,000, పూర్తిస్థాయి దివ్యాంగులకు రూ.15,000 వరకు పింఛన్లు అందుతున్నాయి. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి సెప్టెంబర్ 1, 2026 వరకు రూ.73,508 కోట్లను కేవలం పింఛన్ల కోసమే వ్యయం చేసింది. పేదల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో ఈ ఒక్క గణాంకమే తెలియజేస్తోంది.

**అన్నివర్గాలకు అండ**
ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కేవలం వృద్ధాప్య పింఛన్‌కు మాత్రమే పరిమితం కాలేదు. సమాజంలోని వివిధ వర్గాల ప్రత్యేక అవసరాలను గుర్తించి ప్రభుత్వం దాదాపు 28 రకాల కేటగిరీలలో పింఛన్లు అందిస్తోంది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులతో పాటు చేనేత కార్మికులు, మత్స్యకారులు, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు, సంప్రదాయ చెప్పుల తయారీదారులు, ట్రాన్స్‌జెండర్లు, వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి కూడా పింఛన్ల ద్వారా సామాజిక భద్రత కల్పిస్తోంది. ప్రతి నెలా ఒకటో తేదీన రాష్ట్రవ్యాప్తంగా జరిగే పింఛన్ల పంపిణీని ప్రభుత్వం ఇప్పటికే పేదల పండుగగా మార్చింది. ఇప్పుడు కొత్త అర్హులను కూడా ఈ సామాజిక భద్రత పరిధిలోకి తీసుకురావడం ద్వారా ఆ పండుగను మరింత విస్తరించి మరోసారి సంక్షేమ ప్రభుత్వంగా నిరూపించుకుంది. అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు పాల్గొన్నారు.

# చీకటి ఒప్పందాలు చేసుకుని 1000 రోజుల సంబరాలా మరోపక్క ప్రజల నిరసనలు: భిక్కు రాథోడ్



**నార్నూర్, సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**
నార్నూర్ మండల కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నార్నూర్ మండల బీజేపీ అధ్యక్షులు భిక్కు రాథోడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.గతంలో దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని హామీ ఇచ్చి కేసీఆర్ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి, వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకుండానే 1000 రోజుల పాలన పేరుతో సంబరాలు చేసుకోవడం సరికాదని అన్నారు.ప్రభుత్వం ముందుగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి, ఆ తర్వాతే సంబరాలు చేసుకోవాలని భిక్కు రాథోడ్ డిమాండ్ చేశారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు చలుర్కర్ ప్రకాష్, జాదవ్ దేవిదాస్ రాథోడ్, రాజాబాబు, తెలంగాణరావు, హన్మంతు రాథోడ్, భిక్కు బర్కుంబే, సవాన్ బానోత్, శ్రీకాంత్, ధర్మరక్షక్, హరీష్, ఆదే ప్రతాప్, కిరణ్, ప్రవీణ్, వరుణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# ఉప సర్పంచుల ముందస్తు అరెస్టులు



**మందమర్రిటౌన్, సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఉప సర్పంచ్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు శ్రీ బొట్ల కార్తీక్.. పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్రంలోని ఉప సర్పంచ్ల హక్కుల సాధన కోసం చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి మందమర్రి మండలం నుంచి వివిధ గ్రామాల ఉప సర్పంచ్లు, ఉప సర్పంచ్ల ఫోరం నాయకులు హైదరాబాదుకు బయలుదేరుతున్న తరుణంలో మందమర్రి మండల ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు గిర్నాటి జనార్ధన్, వివిధ గ్రామాల ఉప సర్పంచ్లను రామకృష్ణాపూర్, మందమర్రి పోలీసులు పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం జరిగింది. గ్రామ ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులుగా తమకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన కనీస హక్కుల కోసం మాత్రమే శాంతియుతంగా తమ గొంతును వినిపించడానికి మాత్రమే తాము హైదరాబాదుకు బయలుదేరామని వారన్నారు ప్రభుత్వం ఉప సర్పంచ్ల సమస్యలను వెంటనే గుర్తించి, రాష్ట్ర ఉప సర్పంచ్ల ఫోరం నాయకులతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నారు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్న ఉపసర్పంచ్లు దుర్గం శ్రీనివాస్ పోరెడ్డి మొండి రాజన్న ఎమ్బాడీ సతీష్ దుర్గం పోశం

# రైతన్నలకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ విజ్ఞప్తి

**ఆళ్లగడ్డ, సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఆళ్లగడ్డనియోజకవ వర్గరైతులు, ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని వెలుగోడు నుంచి తెలుగు గంగ కాల్వకు నీటిని విడుదల చేసేలా సంబంధిత మంత్రి తో, జిల్లా కలెక్టర్ తో మాట్లాడి చర్యలు తీసుకోవడం జరిగింది అని ఆళ్లగడ్డ నియోజకవర్గఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు ఆమె మాట్లాడుతూ.ప్రస్తుతం వర్షాలు తక్కువగా ఉండటంతో నీటి లభ్యత కూడా పరిమితంగా ఉంది. అందుకే ఈ నీటిని రైతులు అత్యంత బాధ్యతగా వినియోగించాలని రైతులను కోరారు ముందుగా తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. గ్రామాల్లోని చెరువులు, కుంటలు, తాగునీటి వనరులను నింపుకోవడానికి ఈ నీటిని వినియోగించుకోవాలి. అన్నారు. తాగునీటి అవసరాలు తీరిన తర్వాతే ఇతర అవసరాల గురించి ఆలోచించాలి. అని తెలిపారు

ఎట్టి పరిస్థితుల్లోనూ నీటిని వృథా చేయకుండా, అవసరానికి మించి సాగునీటికి వినియోగించకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలి. అని కోరారు. మనకు అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా ఉపయోగించుకుంటేనే రాబోయే రోజుల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు

రైతన్నలందరూ ప్రభుత్వానికి సహకరించి, నీటిని వృథా చేయకుండా బాధ్యతగా వినియోగించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను అని తెలిపారుప్రజల తాగునీటి అవసరాలు తీర్చడమే మన మొదటి ప్రాధాన్యత. రైతుల సహకారంతో ప్రతి గ్రామానికి తాగునీరు అందేలా కృషి చేస్తాను." అని ఎమ్మెల్యేహామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# గణేష్ విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి

**మందమర్రిటౌన్, సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**
మందమర్రి ప్రజలకు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు మరియు భక్తులకు తెలియజేయునది ఏమనగా, రాబోయే గణేష్ చతుర్థి పండుగను పురస్కరించుకుని గణేష్ విగ్రహాలను ప్రతిష్టించాలనుకునే వారు తప్పనిసరిగా పోలీసు శాఖ నుండి ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుంది.శాంతిభద్రతల పరిరక్షణ మరియు ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడటంలో భాగంగా ఈ క్రింది నియమాలను పాటించాల్సిందిగా కోరడమైనది:
ఆన్‌లైన్ దరఖాస్తు విగ్రహాల ప్రతిష్ట మరియు మండపాల ఏర్పాటు కోసం ముందుగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.మండప ఏర్పాట్ల అనుమతి పత్రం వచ్చిన తర్వాత మాత్రమే వినాయక మండపాలు, మైక్ సెట్లు మరియు ఇతర ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది.సురక్షితమైన మరియు సంతోషకరమైన వాతావరణంలో వినాయక చతుర్థి ఉత్సవాలను జరుపుకోవడానికి మందమర్రి ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాము.



# రాయలసీమలో మొదటిసారిగా నంద్యాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో మోకాలు కీళ్ల మార్పిడి

- శస్త్ర చికిత్స చేసిన నంద్యాల జీ.ఎస్.ఆర్.ఆసుపత్రి ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ మహమ్మద్ రఫీ,డాక్టర్ గుంటి శ్రీకాంత్, మత్తు వైద్యులు డాక్టర్ మధు సూధన రెడ్డి
- అధునాతన ఏఐ(కృత్రిమ మేధ) విధానంలో కీళ్ల శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్య బృందాన్ని అభినందించిన డాక్టర్ రవి కృష్ణ , ఐఎంఏ నంద్యాల వైద్యులు



**నంద్యాల, సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**
పట్టణంలోని పద్మావతి నగర్ మెయిన్ రోడ్డు లో ఉన్న జీ ఎస్.ఆర్. హాస్పిటల్‌లో 70 ఏళ్ల మహిళకు అధునాతన కృత్రిమ మేధ( ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ A.I.) సహకారంతో జర్మన్ టెక్నాలజీతో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం గా నిర్వహించారు.

ఈ శస్త్రచికిత్సను జీఎస్ఆర్ హాస్పిటల్‌కు చెందిన సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్లు డా. మహమ్మద్ రఫీ మరియు డా. గుంటి శ్రీకాంత్ నిర్వహించగా, అనస్థీషియాను సీనియర్ అనస్థీషియా వైద్యులు డా. మధుసూదన్ రెడ్డి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా డాక్టర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఈ శస్త్రచికిత్సలో జర్మన్ ఇంజినీరింగ్‌తో రూపొందించిన ఇంటెలిజెన్షియా రోబోటిక్-సహాయక మోకాలి మార్పిడి వ్యవస్థను వినియోగించారనీ, ఈ కృత్రిమ మేధ(A.I) వినియోగంతో శస్త్రచికిత్సలో కచ్చితత్వాన్ని పెంచడంతో పాటు, ఇంప్లాంట్ అమరికను మెరుగుపరచడం మరియు సాంప్రదాయ పద్ధతులతో పోలిస్తే వేగవంతంగా కోలుకోవడానికి తోడ్పడుతుందన్నారు.
దీర్ఘకాలిక కీళ్ల పనితీరు మెరుగుపడుతుందని అన్నారు.ఇటువంటి అధునాతన AI ఆధారిత మోకాలి మార్పిడి శస్త్రచికిత్స రాయలసీమ ప్రాంతంలో నిర్వహించడం మొదటి సారి కావడం విశేషం అన్నారు. జి ఎస్ ఆర్ ఆసుపత్రి ఆర్థోపెడిక్ సేవల్లో ఈ శస్త్ర చికిత్స ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందన్నారు.శస్త్రచికిత్సలో వినియోగించిన మోకాలి ప్రొస్థెసిస్‌ను ప్రముఖ ఆర్థోపెడిక్ ఇంప్లాంట్ తయారీ సంస్థ మెరిల్ అందించిందనీ. ఈ ప్రక్రియలో మెరిల్ కంపెనీ ప్రతినిధులు నరేష్, రఘు, బాలు సాంకేతిక సహకారం అందించారు.శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్యంగా కోలుకుంటున్నట్లు తెలిపారు. అత్యాధునిక సాంకేతికతలను అందుబాటులోకి తెచ్చి, ప్రపంచస్థాయి ఆర్థోపెడిక్ చికిత్సను రోగులకు అందించేందుకు ముందుకు వచ్చిన జీఎస్ఆర్ హాస్పిటల్ వైద్య బృందాన్ని ఐ ఎమ్ ఏ కేంద్ర కమిటీ సభ్యులు,రాష్ట్ర మాజీ అధ్యక్షులు, లయన్స్ సేవా సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ, నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు, నంద్యాల అనస్తీసియా వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ మధుసూధన రెడ్డి, రాష్ట్ర ఐ ఎమ్ ఏ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ విజయ్ భాస్కర్ రెడ్డి అభినందించారు.

# అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నేతల వినతిపత్రం



**జీడీ మల్లంపల్లి, సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, ములుగు జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణరావు ఆదేశానుసారం మల్లంపల్లి మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని నాయకులు ఆరోపించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీనగర్ సర్పంచ్ ఆకుల మల్లేష్, మల్లంపల్లి టౌన్ అధ్యక్షుడు చీదర సంతోష్, మాజీ ఎంపీటీసీ మాచర్ల ప్రభాకర్, యూత్ అధ్యక్షుడు మొర్రి రాజు యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, పాషా, యువరాజ్, దొంతురాల రవీందర్, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల్లో చోరీలు - 13 మంది అరెస్ట్

## రూ.22.70 లక్షల సొత్తు స్వాధీనం

**మార్కాపురం, సెప్టెంబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**
మార్కాపురం జిల్లాలో దేవాలయాలలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న 13 మంది ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి సుమారు రూ.22 లక్షల 70 వేల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సిఎస్ పురం, కనిగిరి, కొనకనమిట్ల, పామూరు మండలాల్లోని దేవాలయాల్లో ఇటీవల వరుస చోరీలు జరిగాయి. ఈ కేసులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ, కనిగిరి డీఎస్పీ పి. శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పామూరు సీఐ డి. వినోద్ కుమార్, కనిగిరి సీఐ యు. శ్రీనివాసరావు, పలువురు ఎస్సైలు, సీసీఎస్, ఐటీ కోర్ సిబ్బంది సాంకేతిక ఆధారాలు, ఇన్ ఫార్మర్ల సమాచారంతో దర్యాప్తు చేసి మంగళవారం పామూరు మండలం రావిగుంటపల్లి శివారులో 13 మంది నిందితులను అరెస్ట్ చేశారు. స్వాధీనం చేసుకున్న సొత్తు సి.ఎస్.పురం శివాలయంలో చోరీ చేసిన రూ.12 లక్షల విలువైన పార్వతీ పరమేశ్వరుల పంచలోహ విగ్రహాలు, ఇత్తడి అయ్యప్ప విగ్రహం, చీరలదిన్నె కాశీ విశ్వేశ్వర స్వామి గుడి నుండి ఎత్తుకెళ్లిన 4.5 కేజీల వెండి కవచాన్ని కరిగించి చేసిన 4 వెండి గిన్నెలు, గొట్లగట్టు రామాలయంలోని 25 కేజీల ఇత్తడి హనుమంత వాహనాన్ని అమ్మగా వచ్చిన రూ.20 వేల నగదు, వగ్గంపల్లి పోలేరమ్మ గుడి ఇత్తడి కిరీటం, చేతుల కవచాలు. అలాగే నేరానికి ఉపయోగించిన ఒక టూఫాన్ వాహనం, ఒక ఎర్టిగా కారు, రెండు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో కొందరు బేల్దారీ పనులు, స్లాబ్ పనులు చేస్తూ పరిచయం ఏర్పడి, పాత నేరస్తుడు, పూజారిగా పనిచేసే వ్యక్తి సలహాతో దేవాలయాలను టార్గెట్ గా చేసుకున్నట్లు విచారణలో తేలింది. కేసులను ఛేదించిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. దేవాలయాల్లో సీసీ కెమెరాలు, డీవీఆర్ లను సురక్షిత ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్పీ కోరారు.




# పటాన్ చెరులో హై టెన్షన్,,

ఎదురుదురుగా డీ కొన్న కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలు

నువ్వా నేనా యుద్దానికి కాలు దువ్వినా ఇరుపార్టీల నేతలు



**జర్నలిస్ట్ ఫైల్** పటాన్ చెరులో కాంగ్రెస్,బీఆర్ఎస్,మరోవైపు విద్యార్థులు ఏకకాలంలో ఆందోళనలతో అట్టుడికిన పఠాన్ చేరు జాతీయ రహదారి కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీల నేతల మధ్య పోటెత్తిన నినాదాల హోరు ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్,,బిఆర్ఎస్ కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నినాదాలతో మారుమోగినా పఠాన్ చేరు నిరసనలు ప్రదర్శనల నినాదలు మధ్య తలలు పట్టుకున్న పోలీసులు కు ఇదో పెద్ద టాస్క్ లా మారిన యుద్ధం

## తాగు నీటి చెరువులు నింపాలి



గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) : ఎల్ నినో ప్రభావం దృష్ట్యా తాగునీటి సరఫరాకు సమస్యలు తలెత్తకుండా తాగు నీటి చెరువులు నింపాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు. తాగు నీటి చెరువుల నిలువలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బుధవారం సమీక్షించారు. నాలుగు రోజులలో తాగు నీటి చెరువులు నింపాలన్నారు. వర్షాధారిత చెరువులు నింపడానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఒగేరువాగు నింపడం ద్వారా దాని పరిధిలో ఉన్న గ్రామాలకు తాగు నీటిని అందించుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 75 శాతం కంటే ఎక్కువ నీరు నింపాల్సిన 50 చెరువులపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్.ఎస్.పి) నుండి వస్తున్న నీరు ఎవరు ఎక్కడా దారి మళ్ళించే చర్యలు చేపట్టకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ పది రోజుల్లో లక్ష్యం మేరకు చెరువులలో నీరు నింపుట జరుగుతుందన్నారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్.ఎస్.పి) నుంచి గుంటూరు చానల్ కు నీరు విడుదల చేయడం ద్వారా దాని కిందన గల చెరువులు నింపుటకు అవకాశం ఉందని జలవనరుల శాఖ ఇంజనీర్లు తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జలవనరుల శాఖ ఇంజనీర్లు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీర్లు పాల్గొన్నారు.

## అసత్యంపై సత్యం గెలిచి మూడేళ్లు

- ప్రజాస్వామ్యంలో కక్షపూరిత రాజకీయాలకు చోటుండదు
- వైకాపా కక్ష సాధింపుకు ప్రజల దీటైన జవాబు
- అయినా తీరు మారని వైసీపీ పార్టీ విధానాలు
- టిడిపి మండల ఉపాధ్యక్షుడు శీలం నరసింహ గౌడ్



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ): చంద్రబాబు నాయుడుపై అసత్య ప్రచారాలు చేసి జైలుకు పంపిన వైసీపీ అరాచకాలకు చెక్ పెడుతూ ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో అసత్యం పై సత్యం గెలిచి మూడేళ్లు అయిందని టీడీపీ మండల ఉపాధ్యక్షుడు శీలం నరసింహ గౌడ్ తెలిపారు.

బుధవారం బ్రహ్మంగారి మఠంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 45 ఏళ్ళ రాజకీయ అనుభవంలో ఎటువంటి మచ్చలేని తెలుగు రాష్ట్రాలను అన్ని రంగాలలో అగ్రశ్రేణిలో నిలిపిన చంద్రబాబుపై వై.యస్ జగన్మోహన్ రెడ్డి కక్ష సాధింపు ధోరణితో జైలుకు పంపినా అసత్యం ఎక్కువ రోజులు నిలబడలేకపోయిందని అన్నారు.

తమ నాయకుడి పై వచ్చిన అసత్య ఆరోపణలపై స్పందించిన తెలుగుదేశం కార్యకర్తలతో పాటు తిరగబడిన ప్రజల ఆగ్రహంతో 2024 ఎన్నికల్లో వైసీపీని భూస్థాపితం చేసినా వారికి బుద్ధి రాలేదని డీఎస్పీపై అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కక్షపూరిత రాజకీయాలకు పాల్పడితే ఎలాంటి గుణపాఠం లభిస్తుందో తెలియజెప్పడానికే తెలుగుదేశం పార్టీ నేడు "నిజం గెలిచింది" అనే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని వివరించారు. కక్షపూరిత రాజకీయాల కన్నా ప్రజా సంక్షేమం రాష్ట్ర అభివృద్ధి పెట్టుబడులు అనే నినాదంతో రాష్ట్రాన్ని దేశంలోనే అన్ని రంగాలలో ముందుకు తీసుకెళుతున్న నారా చంద్రబాబు నాయుడు దార్శనికత ఆదర్శప్రాయమని కొనియాడారు. వైసిపి అబద్ధాల యూనివర్సిటీలో ఫేక్ ప్రచారాలకు తెరదించి ఇకనైనా ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడితే ప్రజలు క్షమిస్తారని లేదంటే వైసీపీ ని ప్రజలు నామరూపాలు లేకుండా చేస్తారని హెచ్చరించారు.

## హాజీల ఆరోగ్య భద్రతే లక్ష్యం : ఎమ్మెల్యే నసీర్

- 500 మంది హాజీలకు వ్యాక్సినేషన్
- హాజీలకు అన్ని సదుపాయాల కల్పన



గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) : పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్) లోని నాట్కో సెంటర్ లో ప్రత్యేక ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 500 మంది హజ్ యాత్రికులకు (హాజీలకు) బుధవారం స్థానిక జీజీహెచ్ లో ఉచితంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా సౌదీ అరేబియా ప్రభుత్వం, భారత హజ్ కమిటీ నిబంధనల ప్రకారం ప్రతీ యాత్రికుడు తప్పనిసరిగా వ్యాక్సిన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు ఒకే చోట కలిసే సమయంలో ఇన్ఫెక్షన్లు వ్యాపించకుండా నిరోధించేందుకు ముందస్తుగా వ్యాక్సినేషన్ చేయిస్తున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో హాజీలకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున అందిస్తున్నామన్నారు. గతంలో హైదరాబాద్ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారని, ఇప్పుడు గన్నవరం నుంచే వెళ్లేలా ఏర్పాటు చేశారని చెప్పారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ జీ దుర్గాప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు.

## 25 వేల మంది విద్యార్థులతో 'గ్రీన్ గణేష్'

- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదుకు జీఎంసీ సన్నాహాలు




గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) : పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడంతో పాటు నవ గుంటూరు నిర్మాణంలో వారిని భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ఈ నెల 11న 25 వేల మంది విద్యార్థులతో ఏకకాలంలో 'గ్రీన్ గణేష్' మట్టి వినాయక ప్రతిమల తయారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, విద్యాశాఖ, జీఎంసీ అధికారులతో కార్యక్రమం నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల భూమి, నీరు, గాలి కలుషితమై ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని కమిషనర్ తెలిపారు. పండుగలను పర్యావరణహితంగా నిర్వహించి భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. ఈ నెల 11న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుమారు 60 పాఠశాలల్లో విద్యార్థులు తమ పాఠశాల ప్రాంగణాల్లోనే జీఎంసీ అందించే విత్తనాలు కలిపిన మట్టితో స్వచ్ఛందంగా వినాయక ప్రతిమలను తయారు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదుకానుందని తెలిపారు.

కార్యక్రమంలో పాల్గొనే ప్రతి విద్యార్థికి, పాఠశాలకు జీఎంసీ తరఫున అభినందన సర్టిఫికెట్లు అందజేస్తామని కమిషనర్ తెలిపారు. విద్యార్థులను బలవంతంగా కాకుండా స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొనేలా పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తే భవిష్యత్‌లో వారే పర్యావరణ సంరక్షకులుగా మారుతారని పేర్కొన్నారు.

అంతకుముందు 'గ్రీన్ గణేష్' కార్యక్రమాన్ని కేంద్రీకృతంగా పర్యవేక్షించనున్న జీఎంసీ ఎన్టీఆర్ స్టేడియాన్ని కమిషనర్ ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ జి.సాంబశివరావు, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్ బాబు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డిసిపి సూరజ్ కుమార్, ఉపా సెల్ పీఓ సింహాచలం, ఎంఈఓలు ఖుద్దూస్, నాగేంద్రం, జ్యోతి కిరణ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంకి రామబ్రహ్మం భక్తుడు భారి విరాళం



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ): భూత భవిష్యత్ వర్తమాన కాలజ్ఞాన సృష్టికర్త జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠముకు ఉమ్మడి వైయస్సార్ కడప జిల్లా రైల్వే కోడూరు వాస్తవ్యులు మొగిలి రామబ్రహ్మం అనే భక్తుడు లక్షల యాభై వేల(150000)రూపాయల విరాళాన్ని తన భార్య కీర్తిశేషులు మొగిలి లక్ష్మీకాంతమ్మ జ్ఞాపకార్థం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠంకు విరాళంగా అందజేశాడు ఇందులో ఒక లక్ష రూపాయలు కార్తీక శుద్ధ ద్వాదశి రోజున మాస కల్యాణమునకు ఇవ్వగా 35 వేల రూపాయలు నిత్య అన్నదానానికి 15 వేల రూపాయలు శాశ్వత పూజా కార్యక్రమాలకు విరాళంగా అందజేశారు వీరికి మఠాధిపతులు శ్రీ వెంకటాద్రి స్వాముల వారి ఆదేశాల మేరకు శాలువతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు వీరి వెంట స్థానికులు సుంకు నాగేశ్వరరావు శ్రేష్టి ఉన్నారు.

# వినాయక ఉత్సవాల్లో డీజేలకు పూర్తి నిషేధం

- మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు
- మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ హెచ్చరిక
- ఏవైనా ఘర్షణలు జరిగితే ఉత్సవ నిర్వాహకులదే పూర్తి బాధ్యత పోలీసు కేసు నమోదు తప్పదు



మైదుకూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) : వినాయక చవితి ఉత్సవాలను ప్రజలందరూ ఆధ్యాత్మిక భావనతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మైదుకూరు డిఎస్పీ రాజేంద్రప్రసాద్ గారు మరియు స్థానిక అర్బన్ సి.ఐ రమణారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక డిఎస్పీ కార్యాలయంలో డిఎస్పీ రాజేంద్రప్రసాద్ గారి అధ్యక్షతన ప్రత్యేక పీస్ కమిటీ (శాంతి కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు మరియు నిమజ్జనం పై అధికారులు పలు కీలక సూచనలు కఠిన ఆదేశాలు జారీ చేశారు.

**డిఎస్పీ రాజేంద్రప్రసాద్ ముఖ్య సూచనలు, ఆదేశాలు:** ఘర్షణలు జరిగితే నిర్వాహకులదే బాధ్యత వినాయక ఉత్సవాల ఏర్పాట్లలో గానీ ఊరేగింపులో గానీ నిమజ్జనం సమయంలో గానీ ఎలాంటి గొడవలు లేదా ఘర్షణలు జరిగితే దానికి ఉత్సవ నిర్వహణకు పేర్లు నమోదు చేసుకున్న నిర్వాహకులదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సంబంధిత నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

**డీజే లపై పూర్తి నిషేధం:** వినాయక ఉత్సవాల్లో ఊరేగింపుల్లో ఎలాంటి డీజే మైక్ సెట్లకు అనుమతి లేదు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు.

**108 మరియు అత్యవసర వాహనాలకు దారివ్వాలి:** నిమజ్జన ఊరేగింపుల్లో లేదా మండపాల వద్ద ఎంత రద్దీ ఉన్నప్పటికీ 108 వంటి అత్యవసర అంబులెన్సులు ఇతర వాహనాలకు ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యతనిచ్చి దారివ్వాలని స్పష్టం చేశారు.

**ట్రాఫిక్, ఇరుకైన సందులపై నిబంధనలు:** ఇరుకైన సందుల్లో విగ్రహాలను ఏర్పాటు చేయకూడదని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**అర్బన్ సీఐ రమణారెడ్డి కీలక సూచనలు:**

**మహిళల భద్రత, సీసీ కెమెరాలు:** ఉత్సవాలకు, మండపాల వద్దకు వచ్చే మహిళల పట్ల లేదా నిమజ్జన ఊరేగింపులో ఎవరైనా పోకిరీలు అసభ్యంగా ప్రవర్తిస్తే వారిపై చట్టపరంగా అతి కఠినమైన చర్యలు తీసుకుంటాం. ప్రతి మండలం/మండపం వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. మహిళల రక్షణ కోసం రాత్రి వేళల్లో కూడా పోలీసు గస్తీ ఉంటుంది. ఉత్సవాల సమయంలో ఎవరైనా సరే అసాంఘిక శక్తులు, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఉత్సవాలకు సంబంధించి ఏవైనా సమస్యలు లేదా సమాచారం కోసం బద్వేలు ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నిమజ్జన ఊరేగింపు సమయంలో విగ్రహాలను తీసుకెళ్లే ట్రాక్టర్లు ఇతర వాహనాల డ్రైవర్లు మద్యం సేవించి ఉండకూడదు. డ్రైవర్లు తాగి వాహనాలు నడిపితే వారిపై, నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తాం. మైదుకూరు పట్టణంలో హిందూ ముస్లిం సోదరులు కలిసిమెలిసి, మత సామరస్యాన్ని చాటుతూ పండుగను పవిత్రంగా జరుపుకోవాలన్నారు. విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా స్థానిక తహసీల్దార్ మరియు మున్సిపల్ కమిషనర్‌లతో సమన్వయం చేసుకొని మైదుకూరు ఎర్ర చెరువు వద్ద అన్ని రకాల ఏర్పాట్లు (లైటింగ్, క్రేన్లు, ఈతగాళ్లు) పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు పోలీసు శాఖకు సహకరించి పండుగను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూమిరెడ్డి సుబ్బరాయుడు, దొంతు సుబ్రహ్మణ్యం, దొంతు వెంకట సుబ్బయ్య, పాలబాబు, యెలిశెట్టి గురుప్రసాద్ యాకుబ్ అన్వర్ హామీద్ మరియు స్థానిక హిందూ ముస్లిం మత పెద్దలు ఉత్సవ నిర్వాహకులు యువకులు విశేషంగా పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లాలో డెంగ్యూ నివారణ చర్యలు ముమ్మరం

- కంకటపాలెం గ్రామంలో పర్యటించిన జిల్లా మలేరియా అధికారి నాగార్జున రావు



బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్) : బాపట్ల జిల్లాలో డెంగ్యూ వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా బుధవారం బాపట్ల జిల్లా మలేరియా అధికారి వి. నాగార్జున రావు బాపట్ల మండల పరిధిలోని కంకటపాలెం గ్రామంలో పర్యటించారు. గ్రామంలో నమోదైన డెంగ్యూ పాజిటివ్ కేసుకు సంబంధించి చేపట్టిన నివారణ మరియు నియంత్రణ చర్యలను ఆయన స్వయంగా పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

**బాపట్ల ఏరియా వైద్యశాలలో రోగితో ముఖాముఖి**

పర్యటనలో భాగంగా తొలుత బాపట్ల ఏరియా వైద్యశాలకు వెళ్లిన మలేరియా అధికారి నాగార్జున రావు అక్కడ చికిత్స పొందుతున్న డెంగ్యూ వ్యాధిగ్రస్తుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా రోగికి వ్యాధి లక్షణాలు ఎప్పుడు మొదలయ్యాయి, ఆ సమయంలో అతను ఏయే ప్రాంతాలు సందర్శించారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఆసుపత్రి రికార్డుల్లో భాగంగా రోగికి సంబంధించిన రక్త పరీక్ష రిపోర్టులను క్షుణ్ణంగా పరిశీలించారు.

అనంతరం రోగి కోలుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, వైద్యుల సూచనల ప్రాముఖ్యత గురించి వారికి వివరించారు.

**కంకటపాలెం గ్రామంలో క్షేత్రస్థాయి పరిశీలన**

ఆసుపత్రి సందర్శన అనంతరం ఆయన నేరుగా కంకటపాలెం గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలోని స్థానిక ప్రజలతో మరియు ఇళ్ల యజమానులతో నేరుగా మాట్లాడారు.

గ్రామంలో దోమల తీవ్రత ఏ విధంగా ఉంది, పరిసరాల పరిశుభ్రత పరిస్థితులు ఎలా ఉన్నాయనే దానిపై వారితో చర్చించారు.

ఇళ్ల చుట్టూ నిల్వ ఉన్న వర్షపు నీరు మరియు వివిధ మంచినీటి నిల్వలను పరిశీలించారు. డెంగ్యూ వ్యాధిని వ్యాప్తి చేసే 'ఏడిస్' దోమలు మరియు ఇతర దోమల లార్వా (గద్దెలు) ఎక్కడైనా వృద్ధి చెందుతున్నాయా అని కూలంకషంగా తనిఖీ చేశారు.

**ప్రజలకు కీలక ఆరోగ్య సూచనలు**

ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు దోమల నివారణపై పలు కీలక సూచనలు చేశారు.

ఇళ్ల చుట్టూ ఎలాంటి నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఇంటి వద్ద ఉన్న నీటి తొట్టెలు, కుండలు, సంపులు మరియు ప్లాస్టిక్ వ్యర్థ వస్తువులలో నీరు నిలవకుండా జాగ్రత్తపడాలని కోరారు. ప్రతీ శుక్రవారం 'డ్రై డే' గా పాటించి, నీటి నిల్వ ఉండే పాత్రలన్నింటినీ పూర్తిగా ఖాళీ చేసి ఎండబెట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఈ పర్యటన కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్.కె. షకీల్, నరసాయపాలెం హెల్త్ విజిటర్, కంకటపాలెం హెల్త్ ప్రొవైడర్, అలాగే ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు తదితర వైద్య సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని దోమల నివారణ చర్యల్లో పాలుపంచుకున్నారు.

## జి.ఎం.సి కమిషనర్‌ను అభినందించిన కలెక్టర్



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) : వాయు కాలుష్య నియంత్రణలో విశేష ప్రతిభ కనబరిచి, కేంద్ర పర్యావరణ శాఖ నిర్వహించిన 'స్వచ్ఛ వాయు సర్వేక్షణ్'2026లో గుంటూరు నగరం ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారాన్ని దక్కించుకున్న సంగతి తెలిసిందే.

ఈ అవార్డును అందుకున్న గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ ను బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అభినందించారు. దేశ వ్యాప్తంగా 130 నగరాల మధ్య జరిగిన పోటీలో గుంటూరు నగరం పట్టణాల కేటగిరిలో ద్వితీయ స్థానంలో నిలవడం గర్వకారణం అన్నారు. రాష్ట్రస్థాయి కేటగిరీ 2 లో జిఎంసి తొలి స్థానంలో నిలిచింది.

పర్యావరణ పరిరక్షణలో కృషి చేస్తూ మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాక్షించారు. గ్రీన్ గుంటూరు, నవ గుంటూరును సాధించి ప్రజల మనసులో నిలవాలని అన్నారు.

## నిజం గెలిచింది... నీతి నిలిచింది



- చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు..
- కుట్రపూరితంగా 53 రోజుల నిర్బంధం
- నాటి చీకటి రోజుకు నిరసనగా 53 కొవ్వొత్తులు వెలిగించిన ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ దంపతులు

వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):మూడేళ్ల క్రితం ఇదే రోజున రాజకీయ దురుద్దేశంతో అప్పటి వైసీపీ ప్రభుత్వం కుట్రపూరితంగా నమోదు చేసిన తప్పుడు కేసులో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు గారిని అర్ధరాత్రి సమయంలో అరెస్టు చేసి 53 రోజుల పాటు జైలులో నిర్బంధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని జగన్ పై ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మండిపడ్డారు. నాటి చీకటి రోజును నిరసిస్తూ, నిజం గెలిచింది... నీతి నిలిచింది అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ఎత్తున పెద్ద ప్రజలు కొవ్వొత్తులు వెలిగించి సీఎం చంద్రబాబుకి సంఘీభావం ప్రకటిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు తన నివాసంలో సతీమణి, శివశక్తి ఫౌండేషన్ చైర్‌పర్సన్ లీలావతితో కలిసి 53 కొవ్వొత్తులు వెలిగించి నాటి ఘటనను నిరసించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ ఐదు దశాబ్దాల నిస్వార్థ రాజకీయ విలువలకు ప్రతీకగా నిలిచిన చంద్రబాబు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది తెలుగు ప్రజల ఆశీస్సులతో తప్పుడు కేసుల నుంచి కడిగిన ముత్యంలా బయటకు వచ్చారని అన్నారు. అధికారం, కుట్రలు, తప్పుడు కేసులు సత్యాన్ని ఎంతోకాలం అడ్డుకోలేవని, చివరకు నిజమే గెలుస్తుందని, నీతే నిలుస్తుందని జీవీ పేర్కొన్నారు. ప్రజా బలమే తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబుకి శ్రీరామరక్ష అని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల అండదండలతో టీడీపీ మరింత బలంగా ముందుకు సాగుతుందని అన్నారు.

## విగ్రహాలను నిర్దేశించిన ప్రదేశాల్లో నిమజ్జనం చేయాలి



గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) : విగ్రహాలను నిర్ణయించిన నిర్దేశిత ప్రత్యేక నిమజ్జన ప్రదేశాల్లో మాత్రమే నిమజ్జనం చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (జుజదీ) విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి మార్గదర్శకాలను జారీ చేసిందని, వాటిని పాటించి పర్యావరణ హితానికి తోడ్పాటును అందించాలని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించిన అనంతరం విగ్రహాలను జలాశయాలు, నీటి వనరుల్లో నిమజ్జనం చేయడం జరుగుతుందని, తద్వారా నీటి నాణ్యత దెబ్బతింటుండటం ఆందోళనకరమైన అంశంగా ఉందన్నారు. క్లాస్-1 నగరాల పరిధిలో నీటి వనరుల నీటి నాణ్యతను మూడు దశల్లో - నిమజ్జనానికి ముందు, నిమజ్జనం జరుగుతున్న సమయంలో, నిమజ్జనం అనంతరం పర్యవేక్షించి అంచనా వేయాలని సూచించడం జరిగిందని వివరించారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాల్లో ముఖ్యంగా పర్యావరణహిత విగ్రహాలను ఉపయోగించాలన్నారు. రంగులు వినియోగిస్తే పర్యావరణ హిత రంగులు మాత్రమే వినియోగించాలని అన్నారు.

అవసరమైన సౌకర్యాలతో తాత్కాలికంగా ప్రత్యేక నిమజ్జన కొలనులను ఏర్పాటు చేయవచ్చని చెప్పారు. వినాయక మండపాలు నిర్వహించే వర్గాలతో సహా ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. విగ్రహాల నిమజ్జనం సందర్భంగా నీటి నాణ్యత దెబ్బతినకుండా నివారించుటకు సి.పి.సి.బి మార్గదర్శకాలను అమలు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# ఘనంగా 'వాద్-వివాద్' తొలి దశ చర్చా పోటీ



**విజయవాడ, సెప్టెంబర్ 8(జర్నలిస్ట్ పైల్) :** యువతలో ఆలోచనా శక్తి, వక్తృత్వ నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు జాతీయ అంశాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహిస్తున్న విజయవాడ అతిపెద్ద ద్విభాషా అంతర్ కళాశాల చర్చా పోటీ 'వాద్-వివాద్' తొలి ప్రిలిమ్స్ పోటీలు ఆంధ్ర లయోలా కళాశాలలో ఉత్సాహంగా జరిగాయి. ఏఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు.

రెండో ఎడిషన్‌గా కొనసాగుతున్న 'వాద్-వివాద్'లో సంస్కృతి, రాజ్యాంగం, విద్య, యువజన విధానం, దేశ నిర్మాణం వంటి కీలక జాతీయ అంశాలపై విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో ద్విభాషా విధానంలో పోటీ నిర్వహించడం ద్వారా భాషా పరిమితులను అధిగమించి విద్యార్థులు ధైర్యంగా తమ ఆలోచనలను వెల్లడించే అవకాశం కల్పిస్తున్నారు.

ప్రస్తుత కాలంలో సామాజిక మాధ్యమాల్లో స్వల్పకాలిక వీడియోలకే పరిమితమవుతున్న యువతను జాతీయ అంశాలపై లోతుగా ఆలోచించేలా చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. చర్చల ద్వారా విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన, పరిశోధనా సామర్థ్యం, వేదికపై మాట్లాడే నైపుణ్యం, భిన్నాభిప్రాయాలను గౌరవించే ప్రజాస్వామ్య విలువలు పెంపొందుతాయని పేర్కొన్నారు.

ఆంధ్ర లయోలా కళాశాలలో జరిగిన తొలి ప్రిలిమ్స్‌లో విజయవాడలోని పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులను జతలుగా ఏర్పాటు చేసి జాతీయ అంశాలపై చర్చలు నిర్వహించారు. విద్యార్థులు తార్కికంగా తమ వాదనలను వినిపించడంతో పోటీ ఆసక్తికరంగా సాగింది.

**తదుపరి ప్రిలిమ్స్ తేదీలు** : రెండో ప్రిలిమ్స్:లి సెప్టెంబర్ 16 – కేఎల్ యూనివర్సిటీ

మూడో ప్రిలిమ్స్:లి సెప్టెంబర్ 23 – కేబీఎన్ కళాశాల

విజయవాడలోని అన్ని కళాశాలల విద్యార్థులు 'వాద్-వివాద్'లో పాల్గొనవచ్చని ఏఈ ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. యువతలో జాతీయ ఆలోచనా ధోరణిని పెంపొందించి, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు.

# సెప్టెంబర్ 9 ప్రజాస్వామ్యంపై దాడిని గుర్తుచేసే చీకటి రోజు




- చంద్రబాబును అరెస్టు చేసినా ప్రజల గుండెల్లో నుంచి దూరం చేయలేకపోయారు
- వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు

**వేమూరు: సెప్టెంబర్ 9(జర్నలిస్ట్ పైల్) :** రాష్ట్ర చరిత్రలో ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగిన చీకటి అధ్యాయంగా మిగిలిపోయిందని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు అన్నారు. వేమూరు నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాలుగున్నర దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో నారా చంద్రబాబు నాయుడు నిజాయితీ, నిబద్ధతతో తెలుగు ప్రజలకు సేవలందించారని తెలిపారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కేసు పేరుతో చంద్రబాబు నాయుడిని అరెస్టు చేసి 53 రోజుల పాటు రాజమండ్రి జైలులో నిర్బంధించడం రాజకీయ కక్షసాధింపులో భాగమేనని ఆనంద బాబు విమర్శించారు. అరెస్టుతో చంద్రబాబును ప్రజలకు దూరం చేయవచ్చని భావించినా, రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారు ఆయనకు అండగా నిలిచారని పేర్కొన్నారు.

చంద్రబాబును జైలుకు పంపితే ప్రజల నుంచి దూరం చేయవచ్చునుకున్న వారికి 2024 ఎన్నికల తీర్పు చెంపపెట్టులాంటి సమాధానం ఇచ్చిందని ఆనంద బాబు అన్నారు. ప్రజలు ఘనమైన తీర్పుతో టీడీపీకి విజయాన్ని అందించారని, ప్రజల తీర్పే ప్రజాస్వామ్యానికి అసలైన బలమని పేర్కొన్నారు.

ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందన్నారు.

అమరావతి, పోలవరం, వెలిగొండ, పట్టిసీమ వంటి కీలక ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి రాష్ట్ర అభివృద్ధికి కొత్త ఊపునిచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, పెట్టుబడులను ఆకర్షించడం, అభివృద్ధిని ప్రోత్సహించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని చెప్పారు. స్వర్ణాంధ్ర విజన్–2047 లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నక్కా ఆనంద బాబు పిలుపునిచ్చారు.

# బాపట్ల జిల్లా పిడిగా ఎస్.సువర్ణ బాధ్యతలు స్వీకరణ



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** బాపట్ల జిల్లా మహిళ శిశు అభివృద్ధి, సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ గా ఎస్. సువర్ణ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ను బుధవారం ఆమె మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి బదిలీపై బాపట్ల జిల్లాకు వచ్చిన పిడి సువర్ణ చార్జ్ తీసుకున్నారు. అనంతరం ఆ శాఖ కార్యాలయం అధికారులు, సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఇప్పటివరకు ఇక్కడ పిడి గా పనిచేసిన రాధా మాధవి ఏ ఎస్ ఆర్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

# ఆత్మహత్యల నివారణకు బహుముఖ వ్యూహం

- మానసిక ఆరోగ్య సేవల విస్తరణ.. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు
- టెలీ-మానస్‌తో సత్వర కౌన్సెలింగ్.. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు శిక్షణ
- ఆత్మహత్యల నివారణ ప్రయత్నాల్లో అందరి భాగస్వామ్యం అవసరం
- మానసిక సమస్యలతో బాధపడే వారితో ఓపిగ్గా మాట్లాడాలి.. ఓదార్పునివ్వాలి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపు
- నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆత్మహత్యల నివారణకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ బహుముఖ చర్యలు చేపడుతోంది. మానసిక సమస్యలతో సతమతమవుతున్న వారికి సకాలంలో కౌన్సెలింగ్‌తోపాటు వృత్తిపరమైన మానసిక ఆరోగ్య సేవలు అందిస్తోంది. ఆత్మహత్యల నివారణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. మానసిక సమస్యలపై బహిరంగంగా మాట్లాడేలా, సహాయం కోరడం సహజమైన విషయంగా భావించేలా అవగాహన కల్పిస్తోంది. పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ పాఠశాలలు, వసతిగృహాలు, వృద్ధాశ్రమాల్లో అవగాహన, కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బందికి మానసిక ఒత్తిడి, ఆత్మహత్య ఆలోచనలకు సంబంధించిన ముందస్తు హెచ్చరికలను గుర్తించేలా శిక్షణ ఇస్తోంది. అవసరమైన వారికి సకాలంలో వైద్య సేవలు అందేలా రిఫరల్ వ్యవస్థను బలోపేతం చేస్తోంది.ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబరు 10న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆత్మహత్యల నివారణకు చేపట్టే చర్యల్లో కుటుంబాలు, విద్యాసంస్థలు, ఆరోగ్య సిబ్బంది, సమాజం సహా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను మంత్రి వివరించారు.

**వేలాది మందికి అవగాహన** : 2023 నుంచి 2025 వరకు రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో 463, కళాశాలల్లో 308 ఆత్మహత్యల నివారణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వీటి ద్వారా సుమారు 40,740 మంది పాఠశాల విద్యార్థులు, 35,598 మంది కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. 307 సంక్షేమ పాఠశాలలు, వసతిగృహాల్లో కార్యక్రమాలు నిర్వహించి 17,308 మంది విద్యార్థులకు ప్రత్యక్షంగా కౌన్సెలింగ్ అందించారు. 3,086 మంది ఉపాధ్యాయులకు మానసిక ఒత్తిడి, ఆత్మహత్య ప్రమాద సంకేతాలను గుర్తించే అంశాలపై అవగాహన కల్పించారు. సబ్‌జైళ్లు, జువైనల్ హోమ్స్‌లోనూ 266 అవగాహన, నివారణ కార్యక్రమాలు నిర్వహించారు.

**నుజివీడు ట్రిపుల్ ఐటీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాలతో సత్ఫలితాలు** : విద్యాసంస్థల్లో ఆత్మహత్యల నివారణకు చేపట్టిన చర్యల్లో భాగంగా నుజివీడు ట్రిపుల్‌ఐటీలో ప్రత్యేక పైలట్ కార్యక్రమాన్ని అమలుచేశారు. నిరంతర కౌన్సెలింగ్, మానసిక ఆరోగ్య సహాయంతో చేపట్టిన ఈ కార్యక్రమంతో అక్కడ నమోదైన ఆత్మహత్య కేసుల్లో గణనీయమైన తగ్గుదల కనిపించింది. 2021లో రెండు, 2022లో నాలుగు, 2023లో ఒక కేసు నమోదు కాగా 2024, 2025, 2026లో ఇప్పటివరకు ఒక్క కేసూ నమోదు కాలేదు. ఈ కార్యక్రమం ఫలితాలను దృష్టిలో పెట్టుకుని ప్రధాన నగరాలకు దూరంగా, ఒంటరి ప్రాంతాల్లో ఉన్న సున్నితమైన విద్యాసంస్థల్లోనూ ఇలాంటి పైలట్ కార్యక్రమాలను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**టెలీ-మానస్‌తో మానసిక ఆరోగ్య సేవలు** : మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి సులభంగా సేవలు అందించేందుకు టెలీ-మానస్ కీలకంగా మారింది. టోల్‌ఫ్రీ నంబర్ 14416 ద్వారా కౌన్సెలింగ్, సంక్షోభ సమయంలో సహాయం, ప్రమాదాన్ని గుర్తించడం, అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలకు రిఫర్ చేయడం వంటి సేవలు అందుతున్నాయి.

రాష్ట్రంలో టెలీ-మానస్ సేవలకు స్పందన క్రమంగా పెరుగుతోంది. 2022లో 523 కాల్స్ రాగా 2023లో 18 వేలు, 2024లో 20 వేలు, 2025లో 17 వేలు, 2026లో ఇప్పటివరకు 31 వేల కాల్స్ వచ్చాయి. ఇప్పటివరకు రాష్ట్రంలో అందిన 86,529 టెలీ-మానస్ కాల్స్‌లో 2.16 శాతం ఆత్మహత్య సంబంధిత ఆందోళనలకు సంబంధించినవే. ప్రస్తుతం విజయవాడలోని సిద్ధార్థ వైద్య కళాశాల, విశాఖపట్నంలోని ప్రభుత్వ మానసిక వైద్యశాలలో టెలీ-మానస్ కేంద్రాలు ఉన్నాయి. తిరుపతిలో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. మూడు కేంద్రాలను 24 గంటల హబ్‌లుగా అభివృద్ధి చేసి మానసిక వైద్య నిపుణుల సేవలు, ప్రత్యక్ష కౌన్సెలింగ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నామని మంత్రి సత్య కుమార్ తెలిపారు.

**క్షేత్రస్థాయిలో ప్రత్యేక శిక్షణ** : ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సెప్టెంబరు 8న పీహెచ్‌సీల పరిధిలోని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు జిల్లా మానసిక ఆరోగ్య బృందాల ఆధ్వర్యంలో వర్చువల్ విధానంలో గేట్‌కీపర్ శిక్షణ ఇచ్చారు. సెప్టెంబరు 9న ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

**నేడు ప్రత్యేక కార్యక్రమాలు:** సెప్టెంబరు 10న ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐఈసీ కార్యక్రమాలు, మానవహారాలు, అవగాహన ర్యాలీలు, 'స్టార్ట్ ద కన్వర్సేషన్' ఫొటో ప్రచారం నిర్వహించనున్నారు. టెలీ-మానస్ సేవలపై, ఆత్మహత్యల నివారణపై మీడియా, రేడియో ద్వారా కూడా అవగాహన కల్పించనున్నారు.

**మాట్లాడాలి.. వినాలి.. అండగా నిలవాలి** : ఆత్మహత్యలను నివారించడం ఒక్క వైద్య, ఆరోగ్య శాఖ బాధ్యత మాత్రమే కాదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. కుటుంబాలు, పాఠశాలలు, కళాశాలలు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, సమాజం, స్వచ్ఛంద సంస్థలు, ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.'ఒక చిన్న సంభాషణ ఒక జీవితాన్ని కాపాడగలదు. మాట్లాడండి.. వినండి.. జీవించండి' అన్న సందేశంతో ఈ ఏడాది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

# దుర్నీతిపై నిజం గెలిచింది : ఎమ్మెల్యే నసీర్

- సీఎం చంద్రబాబు అరెస్టుకు తెలుగు గుండె రగిలింది
- జైలు గోడల మధ్య బంధించారేగానీ ప్రజల హృదయాల్లో చెరపలేకపోయారు
- వైసీపీ దురాగతాలకు సీఎం చంద్రబాబు అరెస్టు పరాకాష్ట
- సెప్టెంబర్ 9 ఏపీలో చీకటి రోజు
- చంద్రబాబు అరెస్టుకు మూడేళ్ల పూర్తయిన సందర్భంగా కొవ్వొత్తుల ప్రదర్శన



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగుజాతి చరిత్రలోనే సెప్టెంబర్ 9వ తేదీ చీకటి రోజుగా మిలిగిపోతుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్థానిక తూర్పు కార్యాలయంలో నిజం గెలిచింది పేరిట కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో, రాజ్యాంగ విలువలను కాలరాసి, ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రజా నాయకుడు సీఎం నారా చంద్రబాబు నాయుడును 53 రోజులపాటు జైలులో పెట్టారని తెలిపారు. నలభై ఏళ్లకు పైగా కళంకం లేని రాజకీయ జీవితాన్ని గడిపిన ఒక సీనియర్ నాయకుడిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్యానికే మచ్చని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడును భౌతికంగా నిర్బంధించగలిగారేమోగానీ, ప్రజల హృదయాల్లో ఆయనకున్న అచంచలమైన అభిమానాన్ని, విశ్వాసాన్ని తగ్గించలేకపోయారని చెప్పారు. అందుకే 2024 ఎన్నికల్లో వైసీపీ దురాగతాలను ఓటు ద్వారా కూకటివేళ్లతో పెకలించారన్నారు. 70 ఏళ్లకు పైబడిన వయసులో జైలు గోడల వెనుక సీఎం చంద్రబాబు నాయుడు పడిన కష్టం, ఆయన వెంటే నిలిచిన కోట్లాది మంది తెలుగు ప్రజల ఆవేదన ఈ కొవ్వొత్తి కాంతిలో ప్రతిబింబిస్తున్నాయని చెప్పారు. న్యాయస్థానాల్లో ధర్మమే విజయం సాధించి, అక్రమ కేసులు నిలవలేదని తెలిపారు. పాలకులు ఎంతటి అణచివేతకు దిగజారినా, ప్రజాబలం ముందు ఏ కక్షసాధింపు నిలవదని చెప్పారు. రాజకీయ వేధింపులకు భయపడకుండా రాష్ట్ర భవిష్యత్తు కోసం, ప్రజల సంక్షేమం కోసం పునరంకితం కావడమే సీఎం చంద్రబాబు నాయుడు నైజమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్‌పై బీజేపీ మాధవ్ హర్షం

**అమరావతి (జర్నలిస్ట్ పైల్) :** వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు ఉచిత విద్యుత్ అందించనున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం హిందూ బంధువుల్లో సంతోషాన్ని కలిగించిందని పేర్కొంటూ రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ప్రతి సోమవారం ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే బీజేపీ 'జనతా వారధి' కార్యక్రమంలో భాగంగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ నాయకులు అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించారని మాధవ్ తెలిపారు. వినాయక చవితి మండపాలకు ఉచిత విద్యుత్ అందించాలని ఈ వినతిపత్రాల ద్వారా ప్రభుత్వాన్ని కోరినట్లు పేర్కొన్నారు.

బీజేపీ నాయకుల విజ్ఞప్తులపై ప్రభుత్వం తక్షణమే స్పందించి వినాయక చవితి మండపాలకు ఉచిత విద్యుత్ అందించే నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని మాధవ్ అన్నారు. ప్రజల విశ్వాసాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం వేగంగా స్పందించడం సంతోషకరమని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో 'జనతా వారధి' కార్యక్రమం ద్వారా బీజేపీ నిరంతరం కృషి చేస్తోందని మాధవ్ తెలిపారు. ప్రజల విజ్ఞప్తులకు తక్షణమే స్పందించి నిర్ణయం తీసుకున్న రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు మరోసారి ధన్యవాదాలు తెలియజేశారు.

# ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఉచిత బస్సు పాస్ ఇవ్వాలి

- ఆన్‌కాల్, హైర్ బస్ డ్రైవర్లకు కూడా వర్తింపజేయాలి: ఏఐటీయూసీ




**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఆన్‌కాల్ డ్రైవర్లు, హైర్ బస్ డ్రైవర్లందరికీ విధులకు రాకపోకల కోసం ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. విజయవాడ గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై విస్తృతంగా చర్చించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్–6 పథకాల్లో భాగమైన శ్రీ శక్తి, దివ్యాంగుల శక్తి పథకాలను విజయవంతంగా అమలు చేయడంలో ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఆన్‌కాల్ డ్రైవర్లు, హైర్ బస్ డ్రైవర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని ఏపీఎస్ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి తెలిపారు. మహిళలు, దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం అందించేందుకు వీరు ఎంతో కష్టపడి విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

ఆర్టీసీలో ఎన్నో సంవత్సరాలుగా తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కార్మికులు ప్రతిరోజూ విధులకు హాజరయ్యేందుకు సొంత ఖర్చులతో ప్రయాణిస్తున్నారని నాగసుబ్బారెడ్డి తెలిపారు. ఇప్పటికే తక్కువ వేతనాలతో జీవనం సాగిస్తున్న వారికి ప్రయాణ ఖర్చులు అదనపు ఆర్థిక భారంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అందించడంలో కీలకంగా పనిచేస్తున్న వీరి సంక్షేమాన్ని ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఆన్‌కాల్ డ్రైవర్లు, హైర్ బస్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత, వేతనాలు, సంక్షేమం, ప్రయాణ సౌకర్యం వంటి సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. ముఖ్యంగా విధులకు రాకపోకల కోసం ఉచిత బస్సు పాస్ సౌకర్యాన్ని వెంటనే అమలు చేయాలని కోరింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్యతో కలిసి నాగసుబ్బారెడ్డి ప్రభుత్వానికి, ఆర్టీసీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.

# వైద్య, ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- కమిటీల పేరుతో కాలయాపన చేయొద్దు: సీఐటీయూ

విజయవాడ (జర్నలిస్ట్ఫైల్) : వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించి, వారిని రెగ్యులర్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రెగ్యులరైజేషన్, గ్రాస్ సాలరీ తదితర సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు నిర్వహిస్తున్న ఆందోళనలకు సీఐటీయూ మద్దతు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరింది.

వైద్య, ఆరోగ్యశాఖలో ఉద్యోగులను ఏళ్ల తరబడి తాత్కాలిక ప్రాతిపదికన పనిచేయించుకోవడం సమంజసం కాదని, ఈ అంశంపై గతంలోనే హైకోర్టు తీర్పు వెల్లడించిందని సీఐటీయూ పేర్కొంది. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలతో పాటు దాదాపు 186 క్యాడర్ల ఉద్యోగులు శాశ్వత స్వభావం కలిగిన విధుల్లో పనిచేస్తున్నారని తెలిపింది. ఈఎస్ఐ ఆసుపత్రులు, డీఎంఈ, సెకండరీ హెల్త్, సీఎఫ్‌డబ్ల్యూ పరిధిలోని ఉద్యోగులను కూడా రెగ్యులర్ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొంది.రాష్ట్రంలో రెండు లక్షలకు పైగా ఔట్‌సోర్సింగ్, ఆప్కాస్ ఉద్యోగులు వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలు, విశ్వవిద్యాలయాలు, టీటీడీ, సమగ్రశిక్ష, ఉపాధి హామీ, వెలుగు, 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఆయుష్, కస్తూరిబా తదితర పథకాల్లో విధులు నిర్వహిస్తున్నారని సీఐటీయూ తెలిపింది. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లోనూ పెద్ద సంఖ్యలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సేవలందిస్తున్నారని పేర్కొంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గతంలో అమలులో ఉన్న మినిమం టైమ్ స్కేల్‌ను పునరుద్ధరించడంతో పాటు అర్హులైన ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేసింది.

కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఆప్కాస్ ఉద్యోగుల సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ఏపీ రాష్ట్ర కమిటీ కోరింది. ఉద్యోగుల ఆందోళనలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రెగ్యులరైజేషన్, వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సి.హెచ్.నరసింగరావు, ప్రధాన కార్యదర్శి ఏ.వి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

# చంద్రబాబు అక్రమ అరెస్టే జగన్ పతనానికి నాంది

**మంగళగిరి, (జర్నలిస్ట్ ఫైల్):** టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని రాజకీయ కక్షతో తప్పుడు కేసుల్లో ఇరికించి అక్రమంగా అరెస్టు చేసిన ఘటన జగన్ పతనానికి నాంది పలికిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు గుత్తికొండ ధనుంజయారావు అన్నారు. చంద్రబాబు అరెస్టు జరిగి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయం డా.ఎంఎస్ఎస్ భవన్‌లో 'నిజం గెలిచింది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 53 కొవ్వొత్తులు వెలిగించి సంఘీభావం తెలిపారు.ధనుంజయారావు మాట్లాడుతూ ఎలాంటి తప్పు చేయని చంద్రబాబుపై అప్పటి వైసీపీ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే తప్పుడు కేసులు నమోదు చేసిందని ఆరోపించారు. చంద్రబాబు అరెస్టు సమయంలో పాదయాత్రను తాత్కాలికంగా నిలిపివేసి పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచిన నారా లోకేష్ పాత్రను ఆయన అభినందించారు. ఆ కష్టకాలంలో కార్యకర్తలు, నాయకులకు ధైర్యం కల్పిస్తూ లోకేష్ ముందుండి పోరాడారని తెలిపారు. 'జగన్ ప్రిజనరీ.. చంద్రబాబు విజనరీ' అనే విషయం ప్రజలకు స్పష్టంగా తెలుసని పేర్కొన్నారు.చంద్రబాబుకు అండగా నిలిచిన ప్రజలు 2024 ఎన్నికల్లో కూటమికి 164 సీట్లతో చారిత్రాత్మక విజయాన్ని అందించారని ధనుంజయారావు అన్నారు. చంద్రబాబుపై నమోదైన కేసుల విషయంలో న్యాయస్థానాల్లో ఆయనకు ఊరట లభించిందని, చివరకు నిజమే గెలిచిందని పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టు అనంతరం ప్రజల స్పందన, తదనంతరం జరిగిన పరిణామాలు, 2024 ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా నిలిచాయని అన్నారు. రాబోయే రోజుల్లో వైసీపీకి ప్రజలు మరింత గుణపాఠం చెప్పనున్నారని వ్యాఖ్యానించారు. మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్ మాట్లాడుతూ చంద్రబాబును అరెస్టు చేసి టీడీపీని దెబ్బతీయాలని ప్రయత్నించినప్పటికీ, అదే అరెస్టు జగన్ పతనానికి నాంది పలికిందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబును రాజమండ్రికి తరలిస్తున్న సమయంలో ప్రజలు అడ్డుగా నిలిచినా, న్యాయవ్యవస్థపై నమ్మకంతో సంయమనం పాటించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చి చట్టానికి సహకరించారని గుర్తుచేశారు. అక్రమ అరెస్టుతో నాయకుడిని, ఆయన ఆశయాలను బంధించలేరని కాలం నిరూపించిందన్నారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ నాయకులు, పట్టణ, మండల టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467